నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
శుక్రవారం | ఫిబ్రవరి 16, 2024 | www.navatelangana.com

ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలి

- ఏవో విజయ శేఖర్

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

పీఎం కిసాన్ పథకానికి ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని ఏవో విజయశేఖర్ అన్నారు. గురువారం ఈ-కేవైసీ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మండలంలోని ధర్మారెడ్డి, తాండూర్, పోచారం, గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ-కేవైసీ గురించి రైతులకు వివరించారు. మండలంలో 175 మంది రైతులు ఈ-కేవైసీ చేసుకోలేదని వారందరు కూడా తప్పకుండా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈకేవైసీ చేసుకోవడానికి ఆయా గ్రామాల్లో ఏఈఓలను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట ఏఈవోలు నికిత, భవిత ఉన్నారు.

ఇంటి నుంచే మేడారం ప్రసాదం బుక్ చేసుకోవచ్చు

- బాన్సువాడ డిపో మేనేజర్ సరిత దేవి

నవతెలంగాణ-మద్నూర్

ఇంటి వద్ద నుంచే మేడారం బంగారం ప్రసాదాన్ని బుక్ చేసుకునే అవకాశాన్ని ఆర్టీసీ కల్పిస్తుందని బాన్సువాడ డిపో మేనేజర్ సరిత దేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమ్మక్క సారక్క జాతరకు వెళ్లలేని భక్తులు టీఎస్ ఆర్టీసీ కార్గో ద్వారా మేడారం బంగారం ప్రసాదం బుకింగ్ చేసుకోవాలని సూచించారు. బాన్సువాడ డిపో పరిధిలోని బాన్సువాడ, పిట్లం, బిచ్కుంద, నిజాంసాగర్, బీర్కూర్, మద్నూర్, పెద్దకొడప్‌గల్ కౌంటర్లకు విచ్చేసి బుకింగ్ చేసుకోవచ్చునని, లేదా 9154298729, 9392898164 నెంబర్లను సంప్రదించి బుకింగ్ చేసుకోవచ్చునని సూచించారు. జాతర అనంతరం ప్రసాదాన్ని భక్తులకు డోర్ డెలివరీ చేస్తామని పేర్కొన్నారు.

దేశవ్యాప్త సమ్మె.. గ్రామీణబంద్ నేడే..

- మోడీ ప్రభుత్వ వైఫల్యాలపై చార్జ్‌షీట్ ప్రకటించేందుకు సిద్ధం
- కేంద్ర బీజేపీ కార్పొరేట్, మతతత్వ విధానాలపై వినిపించనున్న ధిక్కారస్వరం
- కార్మిక, ఉపాధి చట్టాల నిర్వీర్యంపై నిరసన ప్రదర్శనలకు సిద్ధం
- 15రోజులుగా విస్తృతంగా అవగాహన కల్పించిన ట్రేడ్‌యూనియన్లు, కార్మిక, ప్రజాసంఘాలు
- సమ్మెనోటీసులు ఇచ్చిన స్కీంవర్కర్లు, ఉద్యోగ సంఘాలు
- జాయింట్ ప్లాట్‌ఫామ్ ఆఫ్ ట్రేడ్‌యూనియన్ల ఆధ్వర్యంలో ధర్నాలు, ర్యాలీలకు సన్నద్ధం
- మద్దతు ప్రకటించిన పలురాజకీయ, ప్రజాసంఘాలు



నవతెలంగాణ - నిజామాబాద్

కేంద్రంలోని బీజేపీ సర్కారు అనుసరిస్తున్న కార్పొరేట్-మతతత్వ విధానాలను ప్రతిఘటిస్తూ, మోడీ సర్కారు వైఫల్యాలపై చార్జ్‌షీట్ ప్రకటించేందుకు పిలుపునిచ్చిన నేటి దేశవ్యాప్తసమ్మె-గ్రామీణ బంద్‌కు ఉమ్మడి జిల్లా ఉద్యోగ, కార్మికలోమంతా సిద్ధమైంది. 15రోజులుగా కేంద్రంలోని బీజేపీ కార్మిక, ఉద్యోగుల హక్కులను, వారి సంక్షేమ చట్టాలను ఒక్కొక్కటిగా నిర్వీర్యం చేసి బతుకుఛిద్రం చేస్తున్న వైనంపై ఆయా ట్రేడ్‌యూనియన్లు, కార్మిక, ప్రజాసంఘాలు అవగాహన కల్పించాయి. కరపత్రాలు, వాల్‌పోస్టర్ల ద్వారా సమ్మె ప్రాధాన్యతను వివరించాయి. జాయింట్‌ప్లాట్‌ఫామ్ ఆఫ్ ట్రేడ్‌యూనియన్లుగా అన్ని కార్మిక సంఘాలు ఒక్కటై శుక్రవారం పిలుపునిచ్చిన దేశవ్యాప్త సమ్మె-గ్రామీణ బందు విజయవంతానికి అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో ధర్నాలు, ర్యాలీల ప్రదర్శనలు నిర్వహించనున్నారు. ఇప్పటికే ఈ సమ్మెకు పలు రాజకీయ, ప్రజాసంఘాలూ మద్దతు ప్రకటించాయి.

దేశవ్యాప్త సమ్మెకు ప్రధాన కారణాలివే...

ప్రధానంగా కేంద్రంలోని బీజేపీ సర్కారు అధికారంలోకి వచ్చిన తరువాత కార్మిక చట్టాలను రద్దు చేసింది. స్వాతంత్ర్య సంగ్రామంలో కొట్లాడి మరీ సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్‌కోడ్‌లుగా మార్చింది. అందులో ప్రధానంగా కార్మికుడు తమ సమస్య, హక్కుల కోసం ఉద్యమిస్తే నీరుగారే విధంగా రూపొందించింది. పైగా రోజుకు రూ.178తోనే కార్మికుడు బతకొచ్చేనే నిర్ణయాన్ని చేసింది.

నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ (ఎన్ఎంపీ) పాలసీ ద్వారా మౌలిక వసతులను లీజు పేరుతో ప్రయివేటీకరణను వేగిరం చేసింది. అందులో భాగంగానే ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటుకు అప్పజెప్పింది. అందులో వాటాలనూ విక్రయించింది. తద్వారా ఆయా ప్రభుత్వ రంగాల్లో ఉద్యోగాలకు కోతపడి, ప్రజలకందే ఉచిత సేవలు మృగ్యమయ్యాయి. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు, స్కీం వర్కర్లకు పని భద్రత లేకుండా పోయింది. అసంఘటిత రంగ కార్మికులు హమాలీ, ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లు, భవన నిర్మాణ కార్మికులు గ్రామపంచాయతీ వర్కర్లు, ఆశ, అంగన్‌వాడీ, పశు మిత్ర కార్మికులు కనీస వేతనానికీ దూరం అయ్యారు.

కార్పొరేట్ సంస్థలకు రూ.2లక్షలా 14కోట్ల రుణమాఫీ చేసిన కేంద్ర సర్కారు కార్మికవర్గ సంక్షేమానికి కనీస చర్యలు తీసుకోకపోగా కార్పొరేట్ శక్తులకు శ్రమను దోచిపెట్టేలా చట్టాలను తీసుకొచ్చింది. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత 1997 సేస్స్‌యాక్ట్‌ను 2020లో సవరణ చేసి కార్మిక సంక్షేమ నిధికి గండికొట్టింది. కేంద్ర సర్కారు ఎలాగూ ఇవ్వకున్నా.. సంక్షేమ బోర్డు ద్వారా లబ్ధిపొందుతున్న భవననిర్మాణ కార్మికుల పొట్టగొట్టేలా చర్యలు తీసుకుంది.

సిట్‌అండ్ రన్‌చట్టాన్ని తీసుకొచ్చి డ్రైవర్ల మెడకు ఉరితాడు బిగించిందని ట్రేడ్‌యూనియన్లు ఆ చట్టాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాయి.

రైతువ్యతిరేక చట్టాలు, వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించడం, వ్యవసాయ కూలీలకు గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గించడం వంటి చర్యలతో గ్రామీణ రైతాంగాన్ని మరింత కష్టాల్లోకి నెట్టింది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం

నేటి దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బంధు విషయమై పక్షం రోజుల ముందు నుంచే ఆయా కార్మిక, ప్రజాసంఘాలు, ట్రేడ్‌యూనియన్ నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.

సమ్మెలో జాయింట్ ప్లాట్‌ఫామ్ ఆఫ్ ట్రేడ్‌యూనియన్లు

ప్రధానంగా ఐఎన్‌టీయూసీ, ఎఐటీయూసీ, హెచ్ఎమ్ఎస్, ఐఎఫ్‌టీయూ, బీఆర్‌టీయూ, టీఎన్‌టీయుసీ, ఏఐయూటీయుసీ, సీసీజీఈడబ్ల్యూ, ఏఐడిఈఎఫ్, బ్యాంక్, ఇన్సూరెన్స్ యూనియన్లు సహా సంయుక్త కిసాన్ మోర్చా, రైతు - వ్యవసాయ కార్మిక సంఘాల ఐక్యవేదికలూ ఈ సమ్మెకు సంపూర్ణ మద్దతు ఇచ్చిన కార్మికులను జాగృతం చేశాయి. కేంద్ర బీజేపీ ప్రభుత్వ కార్మిక, రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలు, మతతత్వ ధోరణులకు నిరసనగా ఫిబ్రవరి 16 (నేడు) నిర్వహించబోయే దేశ్యావప్త సమ్మె - గ్రామీణ బంద్‌కు పిలుపునిచ్చాయి. ఇందులో రైతులు, వ్యవసాయకూలీలు, కార్మికులు, స్కీంవర్కర్లు, బ్యాంక్, ఇన్సూరెన్స్‌రంగ ఉద్యోగులను సమ్మెలో తమ నిరసనగళం వినిపించేందుకు ర్యాలీలు, ధర్నాలకు ప్లాన్ చేశాయి.

బంద్‌లో భాగస్వాములు కండి

- సిఐటియు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

బిజెపి, కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా జరిగే బంద్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సిఐటియు జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నరసింహులు, సిఐటియు జిల్లా నాయకులు వెంకట్ గౌడ్ పిలుపునిచ్చారు. గ్రామీణ భారత్ బంద్‌ను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గత పది సంవత్సరాల నుండి కార్మిక చట్టాలను తొలగిస్తూ కార్పొరేట్ కంపెనీలకు వత్తాసు పలుకుతూ కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతుందన్నారు. బిజెపి ప్రభుత్వం నాలుగు కోడ్ బిల్లులు తీసుకువచ్చి కార్మికుల కోసం తయారు చేయబడిన 43 చట్టాలను తొలగించారని, వాటిని తొలగించి అంబేద్కర్‌ను అవమానపరిచారని తెలిపారు. గతంలో 23 మంది ఉంటే పిఎఫ్ ఇవ్వాలన్న కార్మిక నిబంధనను ఈ నాలుగు కోడ్ చట్టాల ద్వారా తొలగించారన్నారు. స్కీం వర్కర్లను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించాలని అన్నారు. ప్రస్తుతం ఈ బిల్లుల వల్ల కార్మికులకు భద్రత లేకుండా పోతుందని వారు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కనీస వేతనం 26,000 ఉండాలని కార్మికులు పోరాడుతుంటే బిజెపి నాయకులు మాత్రం రోజుకు 176 రూపాయలు ఇస్తే సరిపోతుందని ప్రకటనలు ఇస్తున్నారని విమర్శించారు. హిందూ హిందూ భాయ్ భాయ్ అంటూ దేశభక్తి అంటూ గొప్పలు చెప్పే బిజెపి ప్రభుత్వం దేశభక్తి అంటే ఉన్నది అమ్ముకోవడం కాదని, ప్రభుత్వ రంగ సంస్థలైన బిఎస్ఎన్ఎల్, రైల్వే తదితర వాటిని కార్పొరేట్ల మయం చేస్తూ అన్నిట్లో కార్పొరేట్ రంగాన్ని విస్తరిస్తూ కార్మికులకు, ఉద్యోగులకు, ప్రజలకు అన్యాయం చేస్తున్నారన్నారు. కరోనా సమయంలో మున్సిపల్ కార్మికులను, పారిశుద్ధ కార్మికులను మొదటి వారియర్‌గా గుర్తించి వారి కాళ్లు కడిగారని నేడు వారి గురించి ఆలోచించడం లేదన్నారు. నేడు జరిగే భారత్ గ్రామీణ బంద్ కార్మికులకు, కర్షకులకు జరుగుతున్న అన్యాయాన్ని ఎదుర్కోవడం కోసమేనని, ఈ భారత్ గ్రామీణ బంద్‌లో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. బిజెపి కేంద్రంలో అధికారం చేపట్టి పదేళ్లు గడుస్తున్న కాలంలో అన్ని రంగాలను కార్పొరేట్ చేతుల్లోకి వెళ్లాయన్నారు. ఇక మిగిలింది వ్యవసాయ రంగం ఒక్కటేనని, దానిని కూడా కార్పొరేట్ చేతుల్లో పెట్టాలని బిజెపి ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు.


మాట్లాడుతున్న నాయకులు

భారత్ బంద్‌కు విద్యార్థి సంఘాల సంపూర్ణ మద్దతు

దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16న కార్మికులు, కర్షకులు నిర్వహిస్తున్న 'గ్రామీణ భారత్ బంద్'కు వామపక్ష విద్యార్థి సంఘాలు సంపూర్ణ మద్దతును తెలియజేశారు. గురువారం కామారెడ్డిలో విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముదాం అరుణ్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు సురేష్, బివిఎం రాష్ట్ర కార్యదర్శి విటల్, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు శివ, బీడీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నిమ్మ సురేష్ మాట్లాడుతూ.. దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించి ప్రైవేట్, కార్పొరేట్ పెట్టుబడిదారీ వర్గాలకు కట్టబెడుతుందన్నారు.

విద్యారంగంలో శాస్త్రీయ, ప్రజాస్వామ్య, సోషలిస్టు భావాలను తొలగించి అశాస్త్రీయ, మూఢనమ్మకాలను పాఠ్య సిలబస్‌లలో చేరుస్తూ విద్య వ్యవస్థను పూర్తిగా కాషాయకరించే కుట్రలకు పాల్పడుతున్నారని తెలిపారు. అందులో భాగంగానే నూతన జాతీయ విద్యావిధానం 2020ని తీసుకువచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని చెప్పి గద్దెనెక్కిన మోడీ ప్రభుత్వం దేశంలోని విద్యార్థి, యువతకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా తీవ్రంగా మోసం చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షకులకు విద్యార్థి లోకానికి ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలని లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఫిబ్రవరి 16న నిర్వహించే గ్రామీణ భారత్‌బంద్‌కు ప్రజలు, ప్రజాస్వామికవాదులు, మేధావులు, విద్యార్థులు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్. బివిఎం నాయకులు బుల్లెట్, నాయకులు శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకే ఇంటిగ్రేటెడ్ పోలీస్ చెక్‌పోస్ట్

- ప్రారంభించిన జిల్లా ఎస్పీ సింధు శర్మ

నవతెలంగాణ-కామారెడ్డి

చాలా కాలంగా నిరుపయోగంగా ఉన్న ఇంటిగ్రేటెడ్ పోలీస్ చెక్‌పోస్ట్‌కు అవసరమగు మరమ్మతులు చేసి రహదారి భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ కొరకు గురువారం ప్రారంభించినట్టు జిల్లా ఎస్పీ సింధు శర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. 2013లో జాతీయ రహదారి-44 అధికారుల అనుమతితో రోడ్డుప్రమాదాల నివారణ కొరకు ఈ ఇంటిగ్రేటెడ్ పోలీస్ చెక్‌పోస్ట్‌ను టేక్రియాల్ రోడ్‌వద్ద ప్రారంభించి, కొద్దిరోజులు సేవలు కూడా అందించారని, తరువాత మరమ్మతుల వలన చాలా కాలంగా నిరుపయోగంగా ఉండిపోయిందన్నారు. ఈ ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్ట్‌లో కామారెడ్డి రూరల్ సీఐ ఉంటూ పర్యవేక్షిస్తారని, జాతీయ రహదారి-44 పోలీసు పెట్రోల్ వాహనం అధికారులు ఇక్కడ అందుబాటులో ఉంటూ కామారెడ్డి జిల్లా పరిధి నేషనల్ హైవే-44 రహదారిపై ప్రమాదాల నివారణకు కృషి చేస్తారన్నారు. కార్యక్రమంలో ట్రైనింగ్ ఐపీఎస్, కాజల్ సింగ్ ఐపీఎస్, అడిషనల్ ఎస్పి కె.నరసింహారెడ్డి, డిఎస్పీలు ప్రకాష్, శ్రీనివాస్, మధన్‌లాల్, ఎస్పి ఇన్‌సెక్టర్ జార్జ్, సీఐలు చంద్రశేఖర్‌రెడ్డి, రామన్, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.


ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టును ప్రారంభిస్తున్న ఎస్పీ సింధుశర్మ

పార్లమెంట్ ఎన్నికల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు పారదర్శకంగా పనిచేయాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్


మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు పారదర్శకంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్‌లోని ఎన్ఐసి గదిలో జిల్లా ఎస్ఎస్‌టి, ఎఫ్ఎస్‌టి టీములకు జాతీయస్థాయిలో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో అక్రమ మద్యం, డబ్బు, సరుకుల పంపిణీ జరిగినప్పుడు ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి బృందాలకు సమాచారం వచ్చిన వెంటనే వెళ్లి పట్టుకోవాలని సూచించారు. ఎన్నికల్లో రూ.50వేలకు మించి ఆధారాలు లేని డబ్బులను సీజ్ చేయాలని చెప్పారు. రూ.10 లక్షలకు మించి డబ్బులు దొరికితే ఆదాయపన్ను శాఖ అధికారులకు అప్పగించాలని తెలిపారు. ఎన్నికల్లో అక్రమాల నివారణకు ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టిలు కృషి చేయాలని కోరారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కామారెడ్డి ఆర్డీవో రఘునాథరావు, ఎల్లారెడ్డి ఆర్‌డిఓ ప్రభాకర్, కామారెడ్డి తహసీల్దార్ జనార్ధన్, అధికారులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-నిజాంసాగర్

మండలంలోని మహమ్మద్‌నగర్ గ్రామంలో వీధి సిసి రోడ్డు నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ యువజన అధ్యక్షులు మల్లయ్య గారి ఆకాష్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు గ్రామ అభివృద్ధి కొరకు (ఎన్ఆర్ఇజిఎస్) నిధుల నుంచి రూ.10 లక్షలు, సీసీ రోడ్ల నిర్మాణం కోసం మంజూరు చేశారని అందులో భాగంగా రోడ్డు పనులను ప్రారంభించినట్టు వివరించారు. కార్యక్రమంలో తోటరాజు, సత్తయ్య, రామగౌడ్, మోహన్, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు రక్షణ కల్పించాలి

- దాడిచేసే వారిపైన చర్యలు తీసుకోవాలి
- సీపీఐ(ఎం), సీఐటీయూ డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లాలో గల ట్రాన్స్‌జెండర్‌లపైన దాడులు దౌర్జన్యాలు పెరుగుతున్నాయని, వాటిని అరికట్టి రక్షణ కల్పించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. గురువారం నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్నటువంటి ట్రాన్స్‌జెండర్లు ఉపాధి అవకాశాలు లేక బిక్షాటన చేస్తూ శుభకార్యాలలో పాల్గొని వారు అభిమానంతో ఇచ్చే వాటిని తీసుకొని జీవిస్తున్నటువంటి వారిపైన ఇటీవల పిల్లలను హరిస్తున్నారనే నెపంతో ట్రాన్స్‌జెండర్‌లను అనుమానిస్తూ దౌర్జన్యాలు చేస్తూ తీవ్రమైన మానసిక క్షోభకు గురిచేస్తున్నారని తెలిపారు. రోజురోజుకు బిక్కుబిక్కు మంటూ జీవించే పరిస్థితి ట్రాన్స్‌జెండర్‌లకు ఏర్పడిందని వారు ఆవేదన వెలిబుచ్చారు. ఇప్పటివరకు జిల్లాలో ఆదరించిన ప్రజలు జరుగుతున్న దుష్ప్రచారాలను అపోహలను నమ్మి ఇటీవల జిల్లా కేంద్రంలోని గౌతమ్‌నగర్‌లో ఒకరిని విపరీతంగా కొట్టి ప్రాణాలు తీశారని, అదేవిధంగా దేగాంలో ఒకరిని బంధించి నిర్బంధించారని ఈ విధంగా దాడులు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, వాటిని అరికట్టి ట్రాన్స్‌జెండర్లకు రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అంతకుముందు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి తమ సమస్యలపై నినదించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌జెండర్‌ల నాయకులు గంగ, జరీనా, అలక, రక్ష, హారతి, ప్రియా తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ట్రాన్స్‌జెండర్లు, నాయకులు

సంత్ సేవాలాల్ ఆశయాల సాధనకు కృషి చేయాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ ఆశయాల సాధనకు కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పిలుపునిచ్చారు. సేవాలాల్ మహరాజ్ జయంతిని పురస్కరించుకుని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని వినాయకనగర్‌లో గల సేవాలాల్ మహారాజ్ విగ్రహానికి కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, స్థానిక ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘాల బాధ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. ఆ మహనీయుని జయంతి సందర్భంగా గిరిజన ఉద్యోగులకు సెలవు సైతం ప్రకటించిందని గుర్తు చేశారు. చెడు వ్యసనాలకు, దురలవాట్లకు దూరంగా ఉంటూ, సమాజహితానికి పాటుపడాలని శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ చేసిన బోధనలు ఎంతో మందిని ప్రభావితం చేసి సన్మార్గంలో నడిపించాయని అన్నారు. ఆ మహనీయుని ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ సమాజ ప్రగతిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ హితవు పలికారు. గిరిజనుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నాగురావు, వివిధ శాఖల అధికారులు, గిరిజన సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.


సేవాలాల్ విగ్రహానికి పూలమాలవేస్తున్న కలెక్టర్

పంచాయతీకి ఒకే ఒక కార్మికుడు..

- ఘన సన్మానం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని వీరన్నగుట్ట తండా గ్రామ పంచాయతీకి ఒకే ఒక్క పారిశుధ్య కార్మికుడు పోతయ్య ఉన్నాడని, అన్ని పనులు తానే చేస్తూ మంచి పేరు తెచ్చుకున్నాడు. దీంతో గ్రామ కార్యదర్శి వెంకటరమణ పోతయ్యను గురువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ జాదవ్ గణేష్ నాయక్, గ్రామ కార్యదర్శి వెంకటరమణ, హుస్సేన్, రామ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



మెగా రక్తదాన శిబిరం విజయవంతం

- 336 యూనిట్ల రక్తం సేకరణ
- ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు



నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని న్యూ క్లాసిక్ గోల్డెన్ ఫంక్షన్‌హాల్‌లో గురువారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్ 68వ జన్మ దినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరం విజయవంతమైందని ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు, డాక్టర్ వేద ప్రకాష్ మాట్లాడుతూ ఈ రక్తదాన శిబిరంలో 336 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్టు తెలిపారు. సేకరించిన రక్తాన్ని తలసేమియా సికిల్‌సెల్ సొసైటీ హైదరాబాద్ వారికి 201 యూనిట్లు, నిజామాబాద్ రెడ్‌క్రాస్ తలసేమియా రక్తనిధి కేంద్రం వారికి 84 యూనిట్లు, కామారెడ్డి ప్రభుత్వ వైద్యశాల రక్తనిధి కేంద్రానికి 51 యూనిట్లను అందజేసినట్టు తెలిపారు. గత సంవత్సరం కూడా 187 యూనిట్ల రక్తాన్ని సేకరించడం జరిగిందని సంవత్సర కాలంలోపే 2287 యూనిట్ల రక్తాన్ని తలసేమియా చిన్నారులకు అందజేసి రక్తదానంలో రికార్డు సృష్టించామని చెప్పారు. రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి చిన్నారుల ప్రాణాలకు అండగా నిలిచిన షబ్బీర్ అలీకి కామారెడ్డి రక్తదాతల సమూహం తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ రక్తదాన శిబిరానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఎల్లవేళలా కామారెడ్డి రక్తదాతల సమూహం అత్యవసర పరిస్థితిలో వారికి కావలసిన రక్తాన్ని అందజేయడానికి సిద్ధంగా ఉంటుందని అన్నారు. ప్రతి సంవత్సరం ఇదే విధంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించాలని కోరారు. రక్తదానం చేసిన రక్తదాతలకు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో వారి కుటుంబాలకు ఎల్లప్పుడూ రక్తం అవసరమైనా సంప్రదించాలని, వారికి కావాల్సిన రక్తాన్ని ఎల్లవేళలా అందజేయడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. కార్యక్రమంలో కామారెడ్డి రక్తదాతల సమూహ ప్రధాన కార్యదర్శి గంప ప్రసాద్, ఉపాధ్యక్షులు జమీల్, డాక్టర్ పుట్ల అనిల్, కిరణ్, సలహాదారులు ఎర్రం చంద్రశేఖర్, కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ



నవతెలంగాణ-కోటగిరి

గీత కార్మికుల కుటుంబాల ఆశాజ్యోతి కామ్రేడ్ ధర్మ బిక్షం జయంతి సందర్భంగా కోటగిరి మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర గీతా పనివార సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట యోధులు గీత కార్మికుల కుటుంబాల ఆశాజ్యోతి కామ్రేడ్ ధర్మ బిక్షం 102వ జయంతి పురస్కరించుకొని గీత కార్మికులు, గౌడ కులస్తులు కోటగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గీత కార్మికులు టి.గంగాధర్‌గౌడ్, బి.సాయగౌడ్, బి.శ్రీకాంత్‌గౌడ్, గీతా పని వాళ్ళ సంఘం ఉపాధ్యక్షులు బి.వెంకగౌడ్, సహాయ కార్యదర్శి బి.పండరిగౌడ్, కోటగిరి టిసిఎస్ అధ్యక్షులు డి.శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు కోనసముందర్ విద్యార్థి


విద్యార్థిని సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని కోన సముందర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి రాజేశ్వర్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు మధుపాల్ తెలిపారు. ఈనెల 7న నిజామాబాద్ జిల్లా స్థాయి కబడ్డీ టోర్నీ, ఎంపిక పోటీలు ముప్కాల్ మండలంలో జరిగాయి. ఇందులో విద్యార్థి జి. రాజేశ్వర్ కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థి రాజేశ్వర్‌తోపాటు కోచ్‌ను అభినందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, పాల్గొన్నారు.

అధికారులు, జీపి సిబ్బందికి సన్మానం



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని తొర్లికొండ గ్రామపంచాయతీలో ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాల్లో పాల్గొన్న పంచాయతీ శానిటేషన్ వర్కర్స్, సహకరించిన అంగన్వాడీ టీచర్స్, ఐకెపి సిబ్బంది, ఆశ వర్కర్స్ అందరినీ ప్రత్యేకంగా సన్మానించినట్టు ప్రత్యేక అధికారి, ఇన్చార్జి ఎంఈఓ శ్రీనివాస్ తెలిపారు. ఈసందర్భంగా ప్రత్యేక అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ పారిశుధ్య కార్యక్రమాల్లో పాల్గొని గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. వారం రోజుల నుండి నిరంతరంగా శ్రమించిన అందరిని అభినందిస్తూ ప్రత్యేకంగా సన్మానించడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పద్మ, పిఎసిసి చైర్మన్ అవినాష్ రెడ్డి, గ్రామ కార్యదర్శి రాజేశ్వర్, విడిసి సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మూడు కుట్టుమిషన్లు పంపిణీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

అమెరికాకు చెందిన హెల్ప్ టు అదర్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మగుట్టలో పేద మహిళలకు మూడు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెల్ప్ టు అదర్స్ ఇండియా ప్రతినిధి జిల్కర్ విజయానంద్ మాట్లాడుతూ తమ సంస్థ పేదలకు సాయం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతుందన్నారు. హెల్ప్ టు అదర్స్ సంస్థ అధ్యక్షురాలు శ్రీలత కొరడా నేతృత్వంలో ఇప్పటికే జిల్లాలో 12మందికి కుట్టుమిషన్లు పంపిణీ చేశామన్నారు. ఆర్మూరులోని తపస్వి అనాధాశ్రమానికి నిత్యావసరాలు అందజేశామని, నవిపేట్‌కు చెందిన విద్యార్థికి ఎంబిబిఎస్ చదివేందుకు ఆర్థిక సాయం అందజేశామన్నారు. కార్యక్రమంలో హెల్ప్ టు అదర్స్ ఇండియా ప్రతినిధులు జిల్కర్ లావణ్య, చింతల గంగాదాస్, డాక్టర్ జమాల్పూర్ రాజశేఖర్, ప్రశాంత్, పోచయ్య పాల్గొన్నారు.

ధన మహాలక్ష్మమ్మ దేవస్థాన, విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని కొండాపూర్ గ్రామంలో గురువారం వైభవంగా ధన మహాలక్ష్మమ్మ దేవస్థాన మహోత్సవం నిర్వహించారు. గాయత్రి మాత ఆశ్రమ పండితులు, అచల గురు పీఠాధిపతులు, ఆశ్రమ పోషకులు సర్వదేవత సింహకంకణ సన్మానితులు రామడుగు విక్రమాచార్యులు వారి ఆధ్వర్యంలో విశేషంగా ధన మహాలక్ష్మమ్మ విగ్రహ ప్రతిష్టాపన, ధ్వజస్తంభారోహణ కార్యక్రమాన్ని కొండాపూర్ గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకపూజలు, యజ్ఞం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు అన్నదానంసైతం నిర్వహించారు.

ప్రమాదమంచున కల్వర్టు



నవతెలంగాణ-ముప్కాల్

అనునిత్యం రద్దీతో కూడిన ప్రయాణం, ఏ క్షణాన్నైనా ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న అధికారులు మాత్రం ఇటువైపు చూడటం లేదని మండల వాసులు, మరోవైపు వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని పాత జాతీయ రహదారి-7 రోడ్డును మరమ్మతులు చేపట్టిన సమయంలో రోడ్డుకు ఇరువైపులా కల్వర్టులు నిర్మించకపోవడంతో తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. పది రోజుల క్రితం ఇదే రోడ్డుపై వెళ్తున్న కారు కల్వర్టు లోపం వల్ల పక్కన ఉన్న కాలువలో పడి ప్రమాదానికి గురైంది. అదృష్టవశాత్తు కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు. రోడ్డు ప్రమాదకర స్థితిలో ఉన్న రోడ్డు భద్రత అధికారులు పట్టి పట్టనట్లుగా వ్యవహరిస్తుండంపై ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా కల్వర్టు పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

శ్రీ చైతన్య పాఠశాలలో ఫ్యామిలీ ఫెస్ట్


ఫ్యామిలీ ఫెస్టిలో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాలలో స్మార్ట్‌లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా గురువారం ఫ్యామిలీ ఫెస్ట్ నిర్వహించారు. ఈ ఫ్యామిలీ ఫెస్ట్ లో విద్యార్థులకు తల్లిదండ్రుల యొక్క ఔనత్యాన్ని తెలియజేయడానికి శ్రీ చైతన్య యాజమాన్యం తల్లిదండ్రులకు పాదపూజ చేసి వ్వారి పాదాలకు నమస్కరించి తల్లిదండ్రుల దీవెనలు తీసుకునే బృహత్తరమైన కార్యక్రమం జరిగిందని ప్రిన్సిపాల్ ముత్తు పేర్కొన్నారు.వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తల్లిదండ్రుల రుణం ఎన్ని జన్మలెత్తిన తీసుకోలేనిదని, మనం చేసే ప్రతి మంచి పనికి ముందు తల్లిద్రండ్రుల ఆశీర్వచనాలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో 6వ తరగతి నుండి 10వ తరగతి విధ్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రైమరీ కో ఆర్డినేటర్ ప్రసన్న, ప్రీ ప్రైమరీ కో ఆర్డినేటర్ శ్రీ విద్య, డీన్ సంతోష్, ఇంఛార్జి రాకేష్, ప్రీ ప్రైమరీ ఇంఛార్జి లిఖిత, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చెయ్యండి

- ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎఐకెఎంఎస్ నాయకులు

నవతెలంగాణ-మోపాల్

రైతు ఉద్యమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ముఖ్యంగా ఎంఎస్‌పి మద్దతు ధరల గ్యారంటీ చట్టాన్ని తీసుకురావాలని, రైతులపై మోపిన తప్పుడు కేసులను ఎత్తివేయాలని, విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించాలని, భారత రైతుల అప్పులను మాఫీ చేసి రైతులను రుణ విముక్తిల్ని చేయాలని తదితర డిమాండ్స్‌తో శుక్రవారం నిర్వహించే భారత్ బందులో భాగంగా గ్రామీణ బందును విజయవంతం చేయాలనీ అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా అధ్యక్షులు భూమయ్య, తెలంగాణ రైతు సంగం అధ్యక్షులు ఎ రాజేశ్వర్ తెలిపారు. గురువారం తాడేం గ్రామంలో కరపత్రాలు పంచుతూ గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు రైతులతో కలిసి సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం పోలీసులతో రైతులపై జరిపిన లాఠీ ఛార్జిని, భాష్పవాయువును వదిలి రైతులను గాయపరచడన్ని, రైతులను నిర్బంధించడాన్ని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో కంజర భూమయ్య, రైతు సంఘం నాయకులు , గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ కె నారాయణ రెడ్డి, సుదర్శన్ రెడ్డి కాంగ్రెస్ మండల అధ్యక్షులు గాజుల సాయిబాబు, రాజారెడ్డి, మన్సుర్ ఖాన్ అశోక్, గణపతి పాల్గొన్నారు.

పట్టు కోల్పోతున్న బీఆర్ఎస్

- నిరుత్సాహంలో పార్టీ శ్రేణులు
- దూకుడు పెంచిన హస్తం


కాంగ్రెస్ పార్టీలో చేరిన పెర్కిట్ సొసైటీ చైర్మన్ పెంటా భోజరెడ్డి, తదితరులు

నవతెలంగాణ-ఆర్మూర్

జిల్లాపై కాంగ్రెస్ నేతలు దృష్టి పెట్టారు. శాసనసభ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీచిన జిల్లాలో మాత్రం తక్కువ సీట్లు రావడంతో పూర్తిస్థాయి పట్టు కోసం ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. జిల్లా పరిషత్ వైస్ చైర్ పర్సన్ రజిత యాదవ్ బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సమక్షంలో గురువారం కాంగ్రెస్‌లో చేరారు. నియోజక వర్గంలోని మాక్లూర్ సొసైటీ చైర్మన్ బూరోల్ల అశోక్, మున్సి పల్ పరిధిలోని పెర్కిట్ సొసైటీ చైర్మన్ పెంట బోజారెడ్డి తదితరులు నియోజకవర్గ ఇన్చార్జ్ పొద్దుటూరి వినయ్ రెడ్డి సమక్షంలో హస్తం కండువా కప్పుకున్నారు. దీంతో నియోజకవర్గంలో బీఆర్ఎస్ పట్టు కోల్పోతున్నట్లు ..ఏళ్ల తరబడి పార్టీలో ఉన్న పలువురు సీనియర్ నేతలు సైతం తీవ్ర నిరుత్సాహంలో ఉన్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ చైర్మన్ పండిత్ వినీతపై అవిశ్వాస తీర్మానం..

కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులను కలవడంతో మరికొందరు హస్తం వైపు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. గురువారం మాక్లూర్ మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు సైతం కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ఉమ్మడి జిల్లాలోని కీలక స్థానాలు కోల్పోయిన బీఆర్ఎస్...

గత శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ కీలక స్థానాలను కోల్పోయింది.. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల పరిధిలో బాన్సువాడ, బాల్కొండ నియోజకవర్గాల్లో ఆ పార్టీ అభ్యర్థులు గెలవగా నిజామాబాద్ అర్బన్, రూరల్, బోధన్ ఆర్మూర్ నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఓడిపోవడం గత రెండుసార్లు జరిగిన ఎన్నికలలో ఆరు స్థానాలలో గెలవగా ఆ పార్టీ నేతలు ఈసారి రెండు నియోజకవర్గాలకే పరిమితమయ్యారు. నాలుగు నియోజకవర్గాల్లో పదేళ్లపాటు అండగా ఉన్న ఎమ్మెల్యేలు ఓడిపోవడంతో క్యాడర్లో ఆందోళన మొదలైంది. పార్టీ కోసం బాగానే పనిచేసిన అభ్యర్థులు ఓడిపోవడం వల్ల కొంత ఇబ్బందికి గురవుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో క్యాడర్ తటస్థంగా మారిపోయారు. క్యాడర్ ఆందోళన చెందకుండా ఉండేందుకు ఇటీవల పట్టణంలోని పెర్కిట్ ఎంఆర్ గార్డెన్‌లో జడ్పీ చైర్మన్ దాదన్న గారి విటల్ రావు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి నియోజక వర్గ స్థాయి నుండి గ్రామస్థాయి వరకు నాయకులతో సమావేశం నిర్వహించారు. రాబోయే ఎంపీ, మున్సిపల్, సర్పంచ్ ఎన్నికల దృశ్య క్యాడర్లో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ద్వితీయ శ్రేణి నేతలతో పాటు ఇతర నేతలను కలుపుకుంటూ ముందుకు పోయేందుకు ఏర్పాట్లను చేసుకుంటున్నారు.. రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రణాళికలను సిద్ధం చేసుకుంటూ ఎంపీ ఎన్నికలపై దృష్టి సారించేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.

వచ్చే పార్లమెంట్ ఎన్నికలపై హస్తం దృష్టి....

రాష్ట్రంలో తమ ప్రభుత్వమే అధికారంలో ఉండడంవల్ల తమకు కలిసి వస్తుందని భావిస్తూ కేంద్ర, రాష్ట్ర నేతల సూచనల మేరకు పూర్తిస్థాయిలో ప్రజల మధ్యలో ఉండి కార్యక్రమాలను నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. పార్ల మెంట్, జడ్పీ, మున్సిపల్ ఎన్నికల్లో పూర్తి స్థాయి సీట్లను సాధించేందుకు ఇప్పటినుంచే ప్రయత్నాలను మొదలు పెట్టినారు. పది సంవత్సరాల నుండి పదవి లేకపోవడం వల్ల ఆ యా గ్రామాలు, మండలాల నేతలు పూర్తి స్థాయిలో రాబోయే ఎన్నికలపై దృష్టి పెడుతున్నారు. ఎమ్మెల్యేలను మంత్రులను కలుస్తూ పలు కార్యక్రమాలు నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ నేతలు సిద్ధమవుతున్నారు.

హస్తంలో చేరికలు..

ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మాక్లూర్ మండలం అమ్రాద్ గ్రామ నాయకులు కారోబార్ల సంఘం జిల్లా అధ్యక్షులు సూరాజి సుధాకర్, మాజీ ఎంపీటీసీ బొర్ర నందకుమార్, మాజీ సర్పంచ్ మల్ల గౌడ్, తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాక్లూర్ మండల ఓ బి సి సెల్ అధ్యక్షులు రొడ్డ భాస్కర్, అమ్రాద్ గ్రామ అధ్యక్షులు కోలుకొండ రమేష్ కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు. రాబోవు పార్లమెంట్ ఎన్నికలపై కాంగ్రెస్ నేతల దూకుడు పెంచేందుకు సిద్ధం కాగా.. బి ఆర్ఎస్,, బిజెపి శ్రేణులు పై ఎత్తులు వేస్తారా.. వేచి చూడాల్సిందే..

నేడు సమ్మె, గ్రామీణ భారత్ బంద్

- మోడీకి ఓ హెచ్చరిక
- సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్



మాట్లాడుతున్న నూర్జహాన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఈనెల 16న సమ్మె గ్రామీణ బంద్ చేపడుతున్నామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ అన్నారు. గురువారం సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూర్జహాన్ మాట్లాడుతూ.. కేంద్ర బీజేపీ ప్రభుత్వ కార్పొరేట్, మతతత్వ విధానాలను ధిక్కరిస్తూ ప్రతిఘటనకు కార్మికులు, కర్షకులు, కోట్లాది ప్రజానీకం సన్నద్ధమౌతున్నారని అన్నారు. కార్మిక, రైతు, ప్రజానుకూల ప్రత్యామ్నాయ విధానాలకోసం 2024 ఫిబ్రవరి 16న దేశ వ్యాప్తంగా కార్మికుల సమ్మె గ్రామీణ భారత్ బంద్‌కు జాయింట్ ప్లాట్‌ఫారమ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, సంయుక్త కిసాన్ మోర్చా పూనుకున్నదని తెలిపారు. మేము సైతం అంటూ నిజామాబాద్ జిల్లాలోని రాజకీయ పార్టీలు, ప్రజా సం ఘాలు బంద్‌కు మద్దతునిచ్చి, ప్రత్యక్షంగా పాల్గొం టామని ప్రకటించాయని చెప్పారు. భారత్ వెలిగిపోతుంది.. అచ్చేదిన్ ఆయేగా.. ఆత్మనిర్భర్ భారత్.. మేకిన్ ఇండియా వంటి మోసపూ రిత నినాదాలిచ్చిన బీజేపీ కేంద్ర ప్రబుత్వం వల్ల ఈ పదేండ్ల కాలంలో సామాన్య ప్రజలకు ఒరిగిందేమీ లేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాల వల్ల పేద, ధనిక, తారతామ్యాలు తీవ్రమౌతున్నాయని, ఆక్స్‌ఫాం నివేదిక ప్రకారం దేశంలో 139 కోట్ల మంది ప్రజల్లో ఎనభై కోట్ల మంది దారిద్ర్యరేఖకు దిగువన మగ్గిపోతున్నారని అన్నారు. వాటి దుష్పలితాల వల్ల నిరుద్యోగం, దారిద్ర్యం పెరుగుతుందని, కనీస వేతనం ధరలకు అనుగుణంగా పెరగకపోవడం ఈ విధానాల వల్ల నష్టపోయే సమస్త శ్రామిక వర్గాన్ని ఐక్యం చేసి పోరాటాలను ఉధృతం చేయాలని తెలిపారు. సమావేశంలో సిఐటియు జిల్లా కోశాధికారి స్వర్ణ, ఆశ యూనియన్ జిల్లా కోశాధికారి రేణుక, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు భూపతి, ఆటో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు కటారి రాములు, జిల్లా నాయకులు కృష్ణ, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

బషీరాబాద్‌లో గ్రామసభ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామ పంచాయితీలో ఆవరణలో గురువారం గ్రామసభను నిర్వహించారు. ప్రత్యేక పారిశుధ్య ముగింపు కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి మైలారం గంగాధర్ అధ్యక్షతన ఈ గ్రామ సభను నిర్వహించారు. సభలో గ్రామంలోని పలు సమస్యలపై చర్చించారు. ఈ సంద ర్భంగా ప్రత్యేక అధికారి గంగాధర్ మాట్లాడుతూ.. గ్రామంలో ఉన్న పలు సమస్యల గురించి గ్రామసభకు హాజరైన ప్రజలకు, యువతకు అవగాహన కల్పించారు. యువత మద్యపానం, మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా సక్రమైన మార్గంలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సక్కారం అశోక్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, వ్యవసాయ విస్తీర్ణ అధికారిని పద్మ, అంగన్వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, లైన్ మెన్ సురేష్, నాయకులు. గణేష్, దేవేందర్, శ్రీనివాస్, సుమన్, ముత్తెన్న, నారాయణ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా చర్యలు పాటించాలి

- ఎస్ఐ భాస్కరా చారి


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

నవతెలంగాణ-ముప్కాల్

రోడ్డు, భద్రతా చర్యలు పాటించాలని ఎస్ఐ భాస్కరా చారి అన్నారు. ముప్కాల్ పోలీసులు గురువారం వాహనాలను తనిఖీ చేస్తుండగా నెంబర్ ప్లేట్ లేకుండా రోడ్డుపై ప్రయాణిస్తున్న పలు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషనుకు తరలించి జరిమానాలను విధించారు. అనంతరం ద్విచక్ర వాహనాల గుర్తింపు పత్రాలను (రిజిస్ట్రేషన్ పేపర్ల)ను పరిశీలించి వాహన యజమానులకు ఎస్ఐ కౌన్సిలింగ్ ఇచ్చారు. ద్విచక్ర వాహనాలకు నంబర్ ప్లేట్లను బిగించిన తదనంతరం వాహనాలను రిలీజ్ చేశారు. నెంబర్ ప్లేట్ లేకుండా, తప్పుడు నంబర్ల ప్లేటతో దొంగతనాలు, నేరాలు చేస్తున్నందున తమ వాహనాలకు కచ్చితంగా యజమానులు నెంబర్ ప్లేట్స్ పెట్టుకోవాలని సూచించారు. హెల్మెట్ ధరించకపోవడం, ట్రిపుల్ రైడింగ్, రాంగ్ రూట్లలో ప్రయాణించడం ప్రాణానికి హానికరమని అన్నారు. కావున వాహనదారులు రోడ్డుభద్రతా చర్యలు పాటించాలని కోరారు.



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

బొమ్మగాని ధర్మభిక్షంగౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

బొమ్మగాని ధర్మభిక్షంగౌడ్ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. గురువారం సిపిఐ జిల్లా కార్యాలయంలో కామ్రేడ్ బొమ్మ గాని ధర్మభిక్షం గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిజాం పట్టాభిషేక రజతోత్సవాల సందర్భంగా పాఠశాలలో ఉత్సవాలు జరిపాలన్న ప్రధానోపాధ్యాయుడి ఆదేశాలను వ్యతిరేకించి తోటి విద్యార్థులతో కలిసి బహిష్కరించారని అన్నారు. సామాజిక రుగ్మతలపై పోరాటం కోసం తన సహా విద్యార్థులకు శిక్షణ ఇవ్వడానికి విరాళాలు సేకరించి ఒక వసతి గృహం ఏర్పాటు చేశారని తెలిపారు. 1942లో సిపిఐలో చేరి దున్నేవానికి భూమి- గీసేవానికే చెట్టు' కావాలని పోరాడి 5 ఏళ్ల జైలు జీవితం గడిపారని చెప్పారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో 1952లో మునుగోడు శాసనసభ్యులుగా, 1991, 1996లో నల్గొండ లోక్ సభ సభ్యులుగా ఎన్నికై ప్రజా సమస్యలపై గొంతెత్తి పోరాడిన నాయకులు ధర్మభిక్షమని అన్నారు. కనీస మద్దతు ధరకి చట్టబద్ధత కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ చలో ఢిల్లీకి పిలుపునిచ్చిన పంజాబ్ రైతులపై ఢిల్లీ శివార్ లోకి రాకుండా పోలీసులు రైతులపై సోనిక్ ఆయుధాలను ప్రయోగించడం సిగ్గుచేటని అన్నారు. నేడు జరిగే దేశవ్యాప్త సమ్మె గ్రామీణ సడక్ బంద్‌లి కార్యక్రమంలో రైతులు, కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ కార్యదర్శి వై.ఓమయ్య సిపిఐ నాయకులు బి. రఘురాం సఖి సురేష్, హనుమండ్లు, శీను, ఆనంద్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ సమస్యలు పరిష్కరించాలి

- పిడిఎస్‌యు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ యాదగిరికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ పిడిఎస్‌యూ కార్యదర్శి జయంతి మాట్లాడుతూ బాలికలకు అదనంగా హాస్టల్ సౌకర్యం లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే గర్ల్స్ హాస్టల్ నిర్మించాలని అన్నారు. హెల్త్ కేర్ లో డాక్టర్ ను నియమించాలని అంబులెన్స్ ను అందుబాటులో ఉంచాలని, మెస్ బిల్లులపై ప్రత్యేకమైన నిఘా ఉంచాలని తెలిపారు. యూనివర్సిటీలో ఆడిటోరియంతోపాటు మినీ స్టేడియం నిర్మించాలని, వైఫై, వీధి దీపాలు పెట్టాలని, స్పోర్ట్స్‌కి ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలని, జిమ్‌ను ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ జిల్లా నాయకురాలు దేవిక, నాయకులు రవీందర్ ,అక్షయ్ ,హనుమాన్లు, బిందు పాల్గొన్నారు.

7వేలు ఇండ్లు అర్బన్‌కు మంజూరు చేయండి

- పాఠశాలలో వసతులకు నిధులు ఇవ్వండి
- స్పోర్ట్స్ స్టేడియం ఏర్పాటు చేయాలి
- వెయ్యిపడకల ఆస్పత్రిగా పునరుద్ధరించాలి
- అసెంబ్లీలో ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

7,000 ఇండ్లు నిజామాబాద్ అర్బన్‌కి మంజూరు చేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం అసెంబ్లీ సమావేశంలో జీరో అవర్‌లో ఆయన మాట్లాడుతూ తనపైన నమ్మకంతో గెలిపించి, అసెంబ్లీకి పంపిన నియోజకవర్గ ప్రజలకు అసెంబ్లీ సాక్షిగా ధన్యవాదములు తెలిపారు. అనంతరం నియోజకవర్గం లో ఉన్న సమస్యల పై మాట్లాడుతూ.. ఉండటానికి కనీసం నీడ కూడా లేని వాళ్ళు చాలా మంది ఉన్నారని, గత ప్రభుత్వాలు డబుల్ బెడ్ రూమ్ అని చెప్పి, నియోజకవర్గంలో అర్హులైన వారికీ ఒక్కటి ఇవ్వలేదని, కట్టినవికూడా నిరూపయోగంగా ఉన్నాయని అన్నారు. వాటి మరమత్తులకు నిధులు కేటాయించి వాటిని అర్హులైన వారికి వెంటనే కేటాయించాలని, అలాగే ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం 3,500 ఇల్లు నియోజకవర్గనికి ఇస్తామని అన్నారు...కానీ నియోజకవర్గంలో అర్హులైన వారు ఎక్కువ ఉన్నారని, సుమారు 7,000 ఇండ్లు అర్బన్‌కి మంజూరు చేయాలనీ డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలు అధ్వానమైన స్థితిలో ఉన్నాయని, గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల కనీస మౌలిక సౌకర్యాలు లేవని, రాష్ట్ర ప్రభుత్వం, ఇంచార్జ్ మంత్రి స్పందించి వెంటనే వచ్చే విద్య సంవత్సరానికి అన్ని వసతుల కల్పనకు తగిన నిధులు మంజూరు చేయాలనీ డిమాండ్ చేశారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో జాతీయ స్థాయి క్రీడాకారులు ఉన్నారని, వారికీ ప్రోత్సాహంగా స్పోర్ట్స్ స్టేడియం ఏర్పాటు చేయాలనీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలొ కనిస మౌలిక వసతులు సరిగా లేవని, రోగులు అవస్థలు పడుతున్నారని అన్నారు. మౌలిక వసతుల కల్పనతో పాటు వెయ్యి పడకల ఆసుపత్రిగా పునరుద్ధించాలని డిమాండ్ చేశారు. అంతర్గత రోడ్స్, డ్రైనేజ్ వ్యవస్థ అధ్వానంగా ఉన్నాయని, వాటికి ప్రతేక నిధులు కేటాయించాలని వారు విజ్ఞప్తి చేశారు. దేవాలయాల భూములు అక్రమణలకు గురి అయినవి అని, వాటిని పరిరక్షించాలని, అతి పురాతన ఖిల్లా రామాలయాన్ని పర్యటన కేంద్రగా మార్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహ రూపురేఖలు, గుర్తులు, చిహ్నాలు మారుస్తున్నట్లు నిజామాబాదు జిల్లా పేరు కూడా మార్చి ఇందూర్ గా నామకరణం చేయాలని కోరారు.

రెండు గుంటల భూమి కేటాయించండి

- తహసీల్దార్‌కు వినతి



నవతెలంగాణ-మద్నూర్

ప్రైవేటు వాహనాల డ్రైవర్ అసోసియేషన్‌కు మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలం రెండు గుంటల భూమిని కేటాయించాలని విజ్ఞప్తి చేస్తూ ప్రైవేట్ వాహనాల అసోసియేషన్ అధ్యక్షులు షేక్ మగ్గం, ప్రధాన కార్యదర్శి వడ్డేవారు చందర్ ఆధ్వర్యంలో వాహన డ్రైవర్లు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని డిప్యూటీ తహసీల్దార్ తెలిపారు.

ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల్లో కార్మికులకు సన్మానం

నవతెలంగాణ-రెంజల్

మండలంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలలో భాగంగా ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు, గ్రామ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. మండలంలోని బోర్గం, తాడ్‌బిలోలి, బాగేపల్లి, కళ్యాపూర్, కూనేపల్లి, వీరన్నగుట్ట తండా, వీరన్నగుట్ట, రెంజల్ తదితర గ్రామాలలో ప్రత్యేక అధికారులు భుజేందర్, వినయ్‌కుమార్, హెచ్.శ్రీనివాస్, గ్రామ కార్యదర్శులు సుమన్, రాజేందర్‌గౌడ్, శివకృష్ణ, నవీన్, రాజు, వెంకటరమణ, రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



కార్మికులను సన్మానిస్తున్న అధికారులు

ఘనంగా సేవాలాల్ మహారాజ్ జయంతి

- చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి
- వైభవంగా భోగ్‌బండార్
- పలుచోట్ల అన్నదానాలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

గిరిజనుల ఆరాధ్యదైవమైన సేవాలాల్ మహారాజ్ జయంతిని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భోగ్ బండార్ కార్యక్రమాన్ని నిర్వహించి అన్నదానం చేపట్టారు.

మద్నూర్ : మండలంలోని గోజేగావ్ గ్రామంలో సేవాలాల్ జయంతి ఉత్సవాలను ఆ గ్రామపెద్దలు, మద్నూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శివాజీ రాథోడ్, గ్రామ తాజా మాజీ సర్పంచ్ అనిత, ఈరావంతు దేశ్ముఖ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సేవాలాల్ ఆలయంలో ప్రత్యేకంగా పూజలు నిర్వహించిన అనంతరం పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సేవాలాల్ జాతి కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బిచ్కుంద : మండల కేంద్రంలోని భద్రల్ తండాలో బంజారుల ఆరాధ్యదైవం సంత్ శ్రీసేవలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా భవానీమాత ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బిచ్కుంద ఎంపిపి అశోక్ పటేల్, సొసైటీ చైర్మన్ నాల్చార్ బాలాజీ, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ నాల్చార్ శ్రీహరి రాజు, డాక్టర్ రాజు, బస్వరాజ్‌పటేల్, తాండా పెద్దలు జాదవ్‌మాణిక్, గణపతి, సుభాష్‌జాదవ్, ధర్మానాయక్, గోవింద్, హరిపవర్, లచ్చిరం, శంకర్, పూజారి కాశిరం పాల్గొన్నారు.

సేవాలాల్ మహరాజ్ జయంతి సంధర్భంగ అన్నదానం..

బోధన్ : గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి గురువారం బోధన్ మున్సిపల్ పరిధి లోని నర్సాపూర్, ఎస్టీ హాస్టల్‌లో గిరిజనులు ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం భోగ్ బండారు నిర్వహించి, విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో జాదవ్ ప్రవీణ్‌నాయక్, లక్ష్మణ్ చౌహాన్, వసంత్, జాదవ్ కిరణ్, వసురాం నాయక్, మదు, పిక్య నాయక్, శ్రీనివాస్, పీరుసింగ్, గబ్బర్, సాయికృష్ణ హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో సేవాలాల్ జయంతి..

గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతిని బీఎస్పీ ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సంత్ సేవాలాల్ జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వం ప్రత్యేక సెలవుదినం ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే దళితులపై జరిగిన దాడిని ఖండిస్తూ ఘటన వద్ద బాధితులకు మద్దతుగా నిలిచిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను ప్రభుత్వం అక్రమ అరెస్టు చేయడం సిగ్గుచేటని కావున ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, రెడ్డిసాయిలు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ : మండలంలోని మౌలాలితాండ, వీరన్నగుట్ట తండా, దండిగుట్ట గ్రామాలలో సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ మందిరం ఆవరణలో భోగ్ బండార్ సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జాదవ్ సునీత, బాబు నాయక్, జాదవ్ గణేష్ నాయక్, చరణ్‌సింగ్, బన్షియ నాయక్, హుస్సేన్, రవి, తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట్ : మండలంలోని పల్లెపల్లె పొగుడా తండాలో సేవాలాల్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు సేవలాల్ జయంతి వేడుకల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పిటిసి మనోహర్‌రెడ్డి తోపాటు గిరిజనులు పాల్గొన్నారు.

జుక్కల్ : మండలంలోని పలు గ్రామాలలో సేవాలాల్ 285వ జయంతి వేడుకలను గిరిజనులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావర్‌గావ్ తాండాలో సేవాలాల్ యూత్ సభ్యులు, మధురాతాండా, దోస్పల్లి తాండా, మాజీసర్పంచ్ సంజీవ్ చౌహన్, మహమ్మదాబాద్ తండాలో ఇటుకబట్టి జాదవ్ రాజులో సేవాలాల్ చిత్రపటానికి పూలమాలవేసి ఘణంగా సన్మానించారు. అనంతరం గిరిజన యువతులు సంప్రదాయనుకూలంగా నృత్యాలు, సందడి చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వచ్చిన అథితులకు అన్నప్రసాదం నిర్వహించారు. సంత్ సేవాలాల్ అందరికీ ఆరాధ్యుడని తెలిపారు. కార్యక్రమంలో దోస్పల్లి జీపీ కార్యదర్శి మనోహర్, గిరిజన యువజన సంఘం నాయకులు, లంబాడీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.



బిచ్కుంద: సేవాలాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



బోధన్: సేవాలాల్ జయంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం



నాగిరెడ్డిపేట్‌లో...

మూడు ఖాళీ టిప్పర్లు స్వాధీనం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా, పేపర్‌మిల్లు గ్రామ శివారులో అక్రమంగా ఇసుక రవాణా చేయడానికి సిద్ధంగా ఉన్న మూడు టిప్పర్లను టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మండలంలో అక్రమంగా ఇసుక రవాణా జోరుగా కొనసాగుతుందని తెలియడంతో నిజామాబాద్ టాస్క్‌ఫోర్స్ అధికారులు ప్రత్యేక దాడుల నిర్వహిస్తూ గట్టి నిఘాను ఏర్పాటు చేశారు.

ఎస్సైని సన్మానించిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై విజయ్ కొండను గురువారం శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇండస్టెంట్లు బలరాం, చిన్నస్వామి, రజిత, తదితరులున్నారు.

గౌడ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-మద్నూర్

కామారెడ్డి జిల్లా గౌడ సంఘం 2024 నూతన క్యాలెండర్ మద్నూర్ మండల కేంద్రంలో గురువారం గౌడ సంఘం జిల్లా నాయకులు ఆవిష్కరించారు. స్థానిక గౌడ సంఘం నాయకులు శ్రీనివాస్‌గౌడ్, నాగేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలో గ్రామసభలు

నవతెలంగాణ-రెంజల్

మండలంలో గురువారం పలు గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించినట్లు గ్రామాల ప్రత్యేక అధికారులు పేర్కొన్నారు. ఈనెల 7 నుంచి 14 వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలలో భాగంగా గ్రామాలలో అభివృద్ధి పనులను చేపట్టిన పారిశుద్ధ కార్మికులకు ఘనంగా సన్మానించడంతోపాటు, సమస్యలపై గ్రామ సభలను ఏర్పాటు చేశారు. ఈ గ్రామసభల్లో గ్రామంలో అత్యవసర సమస్యలపై చర్చించినట్లు వారు పేర్కొన్నారు. మండలంలో వీరన్నగుట్ట, కూనేపల్లి, బోర్గం, తాడ్‌బిలోలి, వీరన్నగుట్టతండా, రెంజల్, దూపల్లి తదితర గ్రామాలలో గ్రామ సభలను నిర్వహించారు.

నర్సరీ, ప్రకృతి వనాల పరిశీలన



అధికారులకు సూచనలు చేస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని తిర్మన్‌పల్లి, సదాశివనగర్ గ్రామాల్లో నర్సరీలను, ప్రకృతి వనాలను ఎంపిడిఓ సంతోష్‌కుమార్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నర్సరీలపై నీడ ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయన వెంట ఎం.పి.ఓ ఎం.సురెందర్‌రెడ్డి, ఏ.పి.ఓ మధు, టెక్నికల్ అసిస్టెంట్లు, కార్యదర్సులున్నారు.

చిన్నారుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-పిట్లం

చిన్నారుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెడ్ కానిస్టేబుల్ సాయగౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణ ఆవరణలో చిల్డ్రన్స్ కిడ్నాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారుల కిడ్నాపర్స్ పెరిగిపోయారని, చిన్నారులను బజారుకు, పాఠశాలకు పంపే సమయంలో జాగ్రత్తలు వహించాలని, ఎవరినీ అంతా సునాయసంగా నమ్మొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్స్ బుచ్చయ్య చారి, వెంకాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్క గౌడ బిడ్డ కృషి చేయాలని జిల్లా జై గౌడ ఉపాధ్యక్షుడు పండరిగౌడ్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో జై గౌడ సంఘం ఆధ్వర్యంలో జై గౌడ క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు పండరి గౌడ్ మాట్లాడుతూ.. గోల్కొండ కోటను ఏలిన మహావీరుడని గుర్తు చేశారు. ప్రతి ఒక్క గౌడ సోదరులందరూ సర్దార్ సర్వాయి పాపన్న అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మురళిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, సిద్ధాగౌడ్, ప్రకాష్‌గౌడ్, మండల అధ్యక్షుడు విఠల్‌గౌడ్, సభ్యులు శంకర్‌గౌడ్, బాలాగౌడ్, నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్ ఎంపీడీవోను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



ఎంపీడీవోను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-జుక్కల్

జుక్కల్ మండల పరిషత్ అధికారిగా శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టడంతో జుక్కల్ కాంగ్రెస్ మండల నాయకులు గురువారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా జుక్కల్ మాజీ ఎంపీపీ సిద్దాపూర్ లక్ష్మణ్ పటేల్, పెద్దఎడ్గి మాజీ సర్పంచ్ అస్పత్‌వార్ వినోద్, లక్షెట్టి సాయిలు, విండో డైరెక్టర్ పెద్దగుల్లా విఠల్ పాటిల్, బీఆర్ఎస్ నాయకులు నీలుపటేల్, మహమ్మదాబాద్ రామన్న లాడేగాం హన్మండ్లు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా షబ్బీర్‌అలీ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

రాజంపేట్ : ప్రభుత్వ సలహాదారులు, కామారెడ్డి ముద్దుబిడ్డ మహమ్మద్ షబ్బీర్ అలీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు యాదవరెడ్డి, కిసాన్ సెల్ మండలాధ్యక్షులు జూకంటి సుధాకర్‌రెడ్డి, వార్డ్‌మెంబర్ ఇమ్రాన్‌అలీ, గ్రామ ఉపాధ్యక్షులు బెస్త చంద్రం, బీసీ ఉపాధ్యక్షులు సిద్ధరాముల, షాదుల్, రాజిరెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

మండలంలో షబ్బీర్ అలీ జన్మదిన వేడుకలు

రామారెడ్డి : మండలంలో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో, నారెడ్డి స్వచ్ఛంద సంస్థ ద్వారా మండలంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 400 మంది పదవ తరగతి విద్యార్థులకు, ఆయా పాఠశాలలో పరీక్ష ప్యాడ్‌లను అందజేశారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు, మద్దికుంట శ్రీ స్వయంభు బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో అనాథాశ్రమంలోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి 10/10 మార్కులతో తల్లిదండ్రులతోపాటు, గురువులకు, గ్రామానికి మంచి పేరు తేవాలని, కష్టపడి చదివి ఉన్నత స్థానంలో స్థిరపడాలని సూచించారు. కార్యక్రమంలో గిద్ద ఎంపిటిసి ప్రవీణ్‌గౌడ్, సొసైటీ వైస్ చైర్మన్ అమ్ముల పశుపతి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కాంగ్రెస్ నాయకులు బండి ప్రవీణ్, పెండ్యాల నర్సారెడ్డి, దుంపల బాలరాజు, కుమ్మరి శంకర్, బిపేట నర్సింలు, ఇర్షాద్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

షబ్బీర్ అలీ జన్మదినం సందర్భంగా రోగులకు పండ్లు పంపిణీ..

దోమకొండ : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సలహాదారులు మహ్మద్ షబ్బీర్ అలీ జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో, జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్ రోగులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పల్లె రామస్వామిగౌడ్, అబ్రబోయిన స్వామి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అనంతరెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సీతారాం మధు, తాటిపల్లి శ్రీకాంత్, గోపాల్ రెడ్డి, సీతారాం ప్రసాద్, తదితరులున్నారు.




రాజంపేట్: పండ్లు పంపిణీ



రామారెడ్డి: విద్యార్థులకు పరీక్ష అట్టలు అందజేత

వైద్యశాఖ సమస్యలు లేవనెత్తిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-మద్నూర్

ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం జుక్కల్‌లో గల ప్రభుత్వ ఆసుపత్రుల్లో సమస్యలపై ఎమ్మెల్యే తోటా లక్ష్మీకాంతరావు అసెంబ్లీలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వంద పడకల మంజూరైన ఆసుపత్రిలో వైద్యుల నియామకం ఇతర సిబ్బంది నియామకం చేపట్టాలని కోరారు. దాదాపు 18 మంది వైద్యులు ఇతర సిబ్బంది నియామకాలు చేపట్టవలసి ఉందని మారుమూల నియోజకవర్గ ప్రజల వైద్య సౌకర్యాల కోసం ప్రభుత్వం సహకరించాలని అసెంబ్లీలో ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే మొట్టమొదటిసారిగా ముఖ్యమైన సమస్యపై ప్రభుత్వం దృష్టికి అసెంబ్లీ సాక్షిగా తీసుకువెళ్లడంతో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఎమ్మెల్యే తీరు పట్ల హర్షం వ్యక్తం చేశారు.

పాఠశాలలను పరిశీలించిన జడ్పిటిసి

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని రామక్కపల్లి గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలను గురువారం స్థానిక జడ్పిటిసి సభ్యుడు మనోహర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరడంతో గ్రామంలో గల ఎస్సీ కమ్యూనిటీ హాల్లో తరగతులు కొనసాగిస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి సభ్యుడు మాట్లాడుతూ.. గ్రామంలో పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో ప్రభుత్వం వెంటనే స్పందించి నూతన భవనాన్ని మంజూరు చేయాలని ఆయన పేర్కొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్పీటీసీ

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కామారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని క్లాసిక్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో షబ్బీర్ అలీ జన్మదినం సందర్భంగా సోమారంపేట్ గ్రామనికి చెందిన కామారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్, మాచారెడ్డి బీ.ఆర్.యస్ పార్టీ యూత్ అధ్యక్షులు షేక్ అజీజ్ బీ.ఆర్.ఎస్ పార్టీని వీడి తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు నయీం, కామారెడ్డి జిల్లా యూత్ అధ్యక్షులు ఇలియాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కామారెడ్డి బిఆర్ఎస్‌వీ పట్టణ ఉపాధ్యక్షులు ఎండి అశ్వక్, నెమలిగుట్టి తండా గ్రామ యూత్ అధ్యక్షులు చిట్టవేని బాబుతో పాటు మరో 10 మంది సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి మాజీ కౌన్సిలర్ జమీల్, సోమారంపేట్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు నరగౌడ్, రవీందర్‌నాయక్, నెమళిగుట్ట తాండ గ్రామ అధ్యక్షులు సభావట రవీందర్, రంజాన్, పొన్నాల శ్రీనివాస్, పొన్నాల నర్సింహులు, బానోవత్ హిరు తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులకు సన్మానం



కార్మికులను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో పారిశుధ్య వారోత్సవాల ముగింపు సందర్భంగా పారిశుధ్య కార్మికులను సన్మానించారు. పారిశుధ్య కార్మికుల సేవ వెలకట్టనిదని కాంగ్రెస్ సీనియర్ నాయకులు గంగాధర్ దేశాయ్ పేర్కొన్నారు. నిరంతర శ్రమతో గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దిన ఘనత కార్మికులదని ఎంపీడీవో మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పత్తి లక్ష్మణ్, బిజెపి నాయకులు శ్రీనివాస్, ఐకేపి సిబ్బంది విఠల్ తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్ ఎంపిడివోగా శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరణ

నవతెలంగాణ-జుక్కల్



జుక్కల్ ఎంపిడీవో శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని గ్రామాలను అభివృద్ధి పథంలో కొనసాగేలా చూస్తానని, ఇందుకు అందరి కృషి, సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూర్ డిప్యూటీ తహసీల్దార్‌గా రోజా

నవతెలంగాణ-భిక్కనూర్



భిక్కనూర్ మండల డిప్యూటీ తహసీల్దార్‌గా రోజా గురువారం కామారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి బదిలీపై వచ్చి పదవీ బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు డీటీగా పనిచేసిన అనూష మెదక్ జిల్లాకు బదిలీపై వెళ్లారు.

ప్రశంసలు అందుకున్న నటరాజ నృత్యానికేతన్ చిన్నారులు



నవతెలంగాణ-ఆర్మూర్

ఎ ట్ట ణ ం ల ో ని నటరాజనృత్యానికేతన్ గురువు బాశెట్టి మృణాళిని అనంతసాగర్‌లో అమ్మవారి క్షేత్ర సన్నిధానంలో బృంద నృత్యం 20 మంది చిన్నారులతో 9 నిమిషాల 33 సెకండ్లు అమ్మవారికి నృత్యంతో నాట్యార్పణం అమ్మవారి మెట్ల పైన డ్రోన్స్ ఉపయోగిస్తూ చిన్నారుల ప్రదర్శన అలరించింది. ఈ నాట్యానికిగాను నటరాజ నృత్యానికేతనానికి డివోషనల్ అండ్ స్పిచువల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ చిన్నారులందరికీ మెమోంటోస్ ప్రశంస పత్రాలు అందుకున్నట్టు గురువు బాసెట్టి మృణాళిని గురువారం తెలిపారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

జిల్లాలో ఇంటర్మీడియట్ జనరల్, ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయని జిల్లా ఇంటర్ విద్య అధికారి రఘురాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జనరల్ మొత్తం 107మంది విద్యార్థులకు 107 మంది హాజరయ్యారని, ఒకేషనల్ 149 మందికి గాను 139 మంది విద్యార్థులు హాజరు కాగా 10 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. మధ్యాహ్నం జనరల్ విద్యార్థులు 14మందికిగాను 14 మంది హజరయ్యారని అన్నారు. ఒకేషనల్‌లో మొత్తం 159 మంది విద్యార్థులకుగాను 147 మంది విద్యార్థులు హాజరు కాగా 12 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని అన్నారు. ఇంటర్ విద్యా ఆధికారి 2 పరీక్ష కేంద్రాలను, పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు రవికుమార్, రాజీయూదిన్ అస్లాం, దేవరామ్, హై పవర్ డాక్టర్ చిరంజీవి, ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు, 8 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణను సమీక్షించారు.

బడుగు బలహీన దళిత, గిరిజన వర్గాల ఆకాంక్షలు నెరవేర్చేది కాంగ్రెస్ ప్రభుత్వం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న తాహెర్‌బిన్

నవతెలంగాణ-సిరికొండ

తెలంగాణ రాష్ట్రంలో బడుగు బలహీన దళిత, గిరిజన వర్గాల ఆకాంక్షలు నెరవేర్చడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధమేనని టీపీసీసీ ఉపాధ్యక్షులు తాహెర్ బిన్ హందన్ అన్నారు. మండల కేంద్రం బంజారా భవన్ లో సంత్ సేవాలాల్ జయంతిని పురస్కరించుకొని నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలను ప్రారభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి ఉత్సవాల సందర్భంగా వారం రోజులపాటు జరిగే వాలీబాల్ పోటీలలో గ్రామాల నుండి 20 టీములు పాల్గొంటున్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బాకారం రవి, ఎస్టీ సెల్ జిల్లా నాయకుడు సంతోష్ నాయక్, శివాజీ నాయక్, భూపతి నాయక్, చందర్ నాయక్, ప్రవీణ్ నాయక్, బాలకిషన్, రాములు నాయక్ , లస్కర్ నాయక్, గణేష్, బలరాం, మైనారిటీ మండల అధ్యక్షుడు ఆసిఫ్, దిగంబర్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అండర్ 16 కబడ్డీ పోటీలకు కృష్ణవేణి పాఠశాల విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ - బాల్కొండ



రాజును అభినందిస్తున్న పలువురు

మండల కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి సిహెచ్ రాజు ఈనెల ఏడవ తేదీన ముప్కాల్ లో జరిగిన అండర్-16 సబ్ జూనియర్స్ కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు గురువారం ప్రిన్సిపాల్ విజయ్ కర్తన్ తెలిపారు. ఈనెల 16, 17 ,18 తేదీల్లో నల్గొండ జిల్లా సూర్యాపేటలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నట్టు చెప్పారు. రాజును పాఠశాల డైరెక్టర్లు కే భానుచందర్, కే లక్ష్మణ్, ప్రిన్సిపాల్ విజయ్ కర్తాన్ ,గణేష్, శ్రీకాంత్, ఉపాధ్యాయుల బృందం అభినందించారు.

గడువు పొడిగింపు

నవతెలంగాణ-మోర్తాడ్

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ పీజీ కోర్సులలో ప్రవేశాల కోసం ఫిబ్రవరి 29 వరకు గడువు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ పెద్దన్న తెలిపారు. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా గడువును పొడిగించినట్లు పేర్కొన్నారు 200 రూపాయల అపరాధ రుసుంతో మార్చి 31 వరకు గడవు పొడిగించినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునేవారు ఈ అవకాశాన్ని సద్వినియం చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 9494718481 నెంబర్‌ను సంప్రదించాలని కళాశాల ప్రిన్సిపాల్ పెద్దన్న తెలిపారు.

నర్సరీలపై ప్రత్యేక దృష్టి సారించాలి

- ఎంపీడీవో సంతోష్ కుమార్



మాట్లాడుతున్న ఎంపీడీఓ సంతోష్‌కుమార్

నవతెలంగాణ-భీంగల్

రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని నర్సరీల్లోని మొక్కల సంరక్షణకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎంపీడీవో సంతోష్ కుమార్ సూచించారు. గురువారం మండలంలోని దేవనపల్లి, పల్లికొండ , బాచన్ పల్లి గ్రామాలలోని నర్సరీలను వర్మి కంపోస్ట్ షెడ్డులను ఏపీ ఓ నర్సయ్యతో కలిసి పరిశీలించారు. వేసవికాలంలో మొక్కలను ఎండ వేడి నుండి కాపాడేందుకు రెండు పూటల నీటిని పోయాలని గ్రామపంచాయతీ సిబ్బందికి తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులతో పాటు 100శాతం పన్నుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. ఈయన వెంట కార్యదర్శులు ఉన్నారు.

ఎంపీడీవోకు శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు



ఎంపీడీఓను సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రాజా శ్రీనివాస్ కు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాజా శ్రీనివాస్ ను కలిసి శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి శ్రీనివాస్, నాయకులు పాలెపు నరసయ్య, బుచ్చి మల్లయ్య, సింగిరెడ్డి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ వ్యతిరేక విధానాలపై హక్కుల సాధనకు ఉద్యమిద్దాం

- టీఎన్‌జీవోఎస్
- సార్వత్రిక సమ్మెకు ఎస్ఎస్ఏ ఉద్యోగుల మద్దతు

నవతెలంగాణ-కంఠేశ్వర్/నిజామాబాద్‌సిటీ

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ వ్యతిరేక విధానాలకు నిరసనగా హక్కుల సాధనకు ఉద్యమిద్దామని టీఎన్‌జీఓఎస్ టీఎన్‌జీఓఎస్ జిల్లా అధ్యక్షులు అలుక కిషన్, జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్ గురువారం పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (అఖిలభారత ఉద్యోగ సమైక్య) పిలుపు మేరకు ఈనెల 16న జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం ముందు భోజన విరామ నిరసన కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ప్రధాన సమస్యలు సిపిఎస్ రద్దు చేసి, పాత పింఛన్ విధానాన్ని పునరిద్ధరించాలని, ఇన్కమ్ టాక్స్ పరిమితిని 10 లక్షలకు పెంచాలని, ఔట్ సోర్సింగ్ , కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని,



నిజామాబాద్‌సిటీ: సమ్మె పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలనే డిమాండ్ల సాధనకు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. టీఎన్జీవో అన్ని యూనిట్ శాఖల ఉద్యోగులు, సభ్యులు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు సకాలంలో విచ్చేసి నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

నిజామాబాద్ సిటీ:మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో రేపు తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సర్వ శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగులు సంపూర్ణ మద్దతును తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐఎఫ్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్కీం వర్కర్ల పట్ల ముఖ్యంగా సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగుల పట్ల తీవ్రమైన వివక్ష చూపుతున్నాయన్నారు. ఎస్.ఎస్.ఏ లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఇప్పటికీ కనీస వేతనాలు లేవన్నారు. సుప్రీంకోర్టు తీర్పు సమాన పనికి సమాన వేతనం కూడా అమలు కావట్లేదన్నారు. కనీస వేతనాలు అమలు చేయాలని, ఎస్ఎస్ఏ ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని, ఖాళీ పోస్టులను భర్తీచేసి, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లో ఎస్ఎస్ఏకు అధిక నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు రవికిరణ్, జాన్, సత్యపాల్, డప్పు దిలీప్, రాజేశ్వర్, ప్రభాకర్, నితిన్, గంగాధర్, రఘువీర్, మతిన్, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మ్యాదరి గంగాధర్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గ్రామ పంచాయతీ సిబ్బందికి వేతనాల పెంపు, పర్మినెంట్, ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు, మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు, కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించుట, పిఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, ఇన్సూరెన్స్ తదితర సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని కోరుతూ గురువారం ఇందల్ వాయి మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం లో సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మ్యాదరి గంగాధర్ అధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సంవత్సరాల తరబడి పనిచేస్తున్నా పర్మినెంట్‌కు నోచుకోలేదని, అదనంగా కార్మికులను నియమించి వారికి కనీస వేతనాలు ఇవ్వకుండా, పాత కార్మికుల జీతాలను అదనపు కార్మికులకు పంచి ఇవ్వడంతో నెలకు రూ.3,500 నుండి రూ.4,000 మాత్రమే పంచాయతీ కార్మికునికి నెల వేతనం వస్తుందని తెలిపారు. ఈ వేతనాలు కూడా నెలల తరబడి ఇవ్వకపోవడంతో అప్పులు చేసుకుని బతకాల్సిన పరిస్థితుల్లో పంచాయితీ కార్మికులున్నారని పేర్కొన్నారు. పంచాయతీ సిబ్బందికీ రూ.5 లక్షల ఇన్సూరెన్స్, దహన సంస్కారాలకు రూ.10వేలు ఇస్తామని సర్క్యులర్ జారీ చేసి ఈ స్కీమ్ విధి విధానాలు ప్రకటించకుండా, అమలు చేయకుండా మోసం చేశారని



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కార్మికులు

దుయ్యబట్టారు. మేనిఫెస్టోలో పొందుపర్చిన విదంగా కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, కారోబార్, బిల్ కలెక్టర్లు, గుమస్తాలను సహాయ కార్యదర్శులుగా నియమిస్తామనే హామీల అమలుకు సత్వరమే చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆలోపు ఇతర శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, సిబ్బందికి జీఓ నెం.60 ప్రకారం వేతనాలు చెల్లించినట్లుగా తమకువేతనాలు పెంచాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేసి, పాత విధానం పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు అశోక్,పి.గంగారాం మలయ్య రాజ నర్సయ్య, నాగేష్, భూపతి తోపాటు తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీ నవనాథ్ సిద్దేశ్వర స్వామి జాతర

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి మండలంలోని గన్నారం గ్రామ సమీపంలోని సిద్దులగుట్టపైన శ్రీ నవనాథ్ సిద్దేశ్వర స్వామి జాతరను గ్రామ అభివృద్ధి కమిటీ, యువజన సంఘాలు, పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించనున్నట్లు పద్మశాలి సంఘం సభ్యులు గురువారం తెలిపారు. జాతర మహోత్సవ కార్యక్రమానికి భక్తులు భారీగా తరలిరావాలని వారన్నారు. జాతర కోసం విస్తృతంగా ఏర్పాటు చేసినట్లు వారు వివరించారు.

రేణుకా చౌదరిని కలిసిన ఇమ్మడి గోపి ముదిరాజ్



రేణుకా చౌదరికి బొకేను అందజేస్తున్న షబ్బీర్ అలీ, ఇమ్మడి గోపి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

రాజ్యసభ సభ్యురాలిగా ఎన్నికైన మాజీ మంత్రి రేణుకా చౌదరిని గురువారం ధర్పల్లి మాజీ ఎంపీపీ, ముదిరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇమ్మడి గోపి ముదిరాజ్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రాష్ట్ర సలహాదారులు మోహమ్మద్ షబ్బీర్ అలీతో వెళ్లి మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకే శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అగ్రనేతలు రేణుకా చౌదరిని రాజ్యసభ ఎంపీగా ప్రకటించడం అభినందనీయమని అన్నారు. చివరి రోజు నామినేషన్ వేసి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో వచ్చే లోక్ సభ ఎన్నికల్లో జిల్లాలో కాంగ్రెస్ ఎంపి భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

గన్నారంలో అన్నదానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండలంలోని గన్నారం గ్రామంలో గ్రామ దేవతల విగ్రహాలను ఒకచోట పెట్టి గురువారం పండుగను గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. అన్నదానం చేశారు. కార్యక్రమం లో గ్రామస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

స్పాట్ అమౌంట్ విడుదల చేయాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



వినతిపత్రం అందజేస్తున్న టీఎల్ఎఫ్ నాయకులు

పెండింగ్‌లో ఉన్న స్పాట్ అమౌంట్ విడుదల చేయాలని టిఎల్ఎఫ్ నాయకులు కోరారు. గురువారం నిజామాబాదు జిల్లా ఇంటర్ విద్య అధికారి (డిఐఇఓ) రఘురాజ్ (టిఎల్ఎఫ్) తెలంగాణ లెక్చరర్ ఫోరం -2023 మే, జూన్‌లో రమ్-నిజామాబాదు (తెలంగాణ లెక్చరర్ ఫోరమ్) ఆధ్వర్యంలో 2023 విద్యాసంవత్సరం స్పాట్ అమౌంట్ 80 శాతం విడుదలై 20 శాతం పెండింగ్‌లో ఉన్న అమౌంట్ విడుదల చేయాలని, తెలంగాణ లెక్చరర్ ఫోరం ఆధ్వర్యంలో డిఐఇఓ రఘురాజ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం టిఎల్ఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టిఎల్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్ గౌడ్ , టౌన్ ప్రెసిడెంట్ గజానంద్, టిఎల్ఎఫ్ ప్రతినిధులు బండ్డయ్యప్ప స్వామి, శ్రీనివాస్, నవీన్, తదితర అధ్యాపక బృందం పాల్గొన్నారు. ఈ విషయమై డిఐఇఓ రఘురాజ్ సానుకూలంగా స్పందించి త్వరగా విడుదలకు కృషి చేస్తానని తెలిపారు.

రేణుక ఎల్లమ్మ వార్షికోత్సవ ఉత్సవాలు



నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి రేణుక తల్లి ఎల్లమ్మ ఉత్సవాల్లో భాగంగా గురువారం యజ్ఞం ఎంతో వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మేడిదాల సంగీత రవి గౌడ్, గౌడ కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాతంత్ర విప్లవమే పునాదిగా పార్టీల విలీనం

- ప్రజాపంథా జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ

నవతెలంగాణ-ఎడపల్లి

దేశంలో ప్రజాతంత్ర విప్లవమే పునాదిగా ఉద్యమ నిర్మాణం చేయడానికి మూడు విప్లవ పార్టీలు వీలినమై ఒకే విప్లవ పార్టీగా మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ స్పష్టం చేశారు. మండలంలోని జానకంపేట్ గ్రామంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మూడు విప్లవ పార్టీల వీలైన జాతీయ మహాసభలు మార్చ్ 3,4,5 తేదీల్లో ఖమ్మం పట్టణంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో బలమైన విప్లవోద్యమ నిర్మాణం అత్యవసరమని దాని కోసమే మూడు విప్లవ పార్టీలు వీలిన దిశగా అడుగులు వేశాయన్నారు. గ్రూపులుగా ఉన్న విప్లవ పార్టీలో ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఐక్యం కావలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మతోన్మాదంతో దేశంలో ప్రజల మధ్య ఘర్షణలను సృష్టిస్తున్నదని, ఇది ప్రమాదకరమని వివరించారు. కమ్యూనిస్టులందరూ కలిసి పోరాడవలసిన అవసరాా ఉందన్నారు. కార్యక్రమంలో సిపిఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర నాయకులు ఎం.నరేందర్, ఎడపల్లి మండల కార్యదర్శి గుమ్మల గంగాధర్, డివిజన్ కార్యదర్శి డి.రాజేశ్వర్, మండల నాయకులు బండారి లక్ష్మణ్, శ్రీపతి మల్లేష్, కొండ్ర లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ హిందీ ఉపాధ్యాయుడికి డాక్టరేట్ పట్టా

నవతెలంగాణ-బాన్సువాడ



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న హిందీ విజయ్‌కుమార్

మండలంలోని తెలంగాణ ఆదర్శ పాఠ శాలలో హిందీ ఉపాధ్యా యుడు విజయ్ కుమార్‌కు ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పి.హెచ్.డి పట్టా దక్కింది. 'సమ్ కాలిన హిందీ కహానియో మే గ్రామీణ జీవన్' అనే అంశంపై ఉస్మానియా విశ్వవిద్యాలయం హిందీ విభాగంలోని బోర్డ్ అఫ్ చైర్‌పర్సన్ డా.కె.సంగీత వ్యాస్ పర్యవేక్షణలో, హెచ్.ఓ.డి. ప్రొఫెసర్ మాయదేవి చేతుల మీదుగా పిహెచ్‌డి పట్టా అందుకున్నారు. డా.ఎస్.విజయ్ కుమార్ కామారెడ్డి జిల్లాలో మారుమూల జుక్కల్ మండలంలోని బిజ్జల్‌వాడీ అనే చిన్న గ్రామంలో రాజబాయి-రామ్‌చందర్ అనే దంపతులకు పేద నిరుపేద కుటుంబంలో జన్మించారు.

సమ్మె నోటీస్ అందజేత

నవతెలంగాణ-వర్ని (చందూర్)

నేడు చేపట్టబోయే గ్రామీణ సడక్ బందులో భాగంగా చందూర్ మండలానికి చెందిన పలు గ్రామాల పంచాయతీ సిబ్బంది, కార్మికులు గురువారం ఎంపీడీవో ఆఫీసులో సమ్మె నోటీసును అందజేశారు.

డంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలో గురువారం బాల్కొండ ఎస్సై కే గోపి ఆధ్వర్యంలో విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ , వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలలో పలు కేసులు నమోదు చేశారు. అలాగే వాహనాలను పరీక్షించి సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానాలు విధించారు. పాత పెండింగ్ చాలాన్లను ఆన్ లైన్ లో పరిశీలించారు.ఈ తనిఖీలలో హెడ్ కానిస్టేబుల్ జయవంతరావు, కానిస్టేబుల్స్ లింగం ,సాయికుమార్, సదానందం, మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ జయంతి




ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పలు గ్రామాల్లో సేవాలాల్ 285వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. యాచారం తండాలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బోగ్ బండారు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. వాహనంపై సేవాలాల్ చిత్ర పటాన్ని ఏర్పాటు చేసి ప్రధాన వీధుల్లో డీజేల ద్వారా ఊరేగింపు నిర్వహించారు. వజ్జపల్లి తండా నుంచి కామారెడ్డి జిల్లా వరకు ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తాజ మాజీ సర్పంచ్ లత బనోత్ మంగ్యా నాయక్, మాలోత్ రమేష్, రమేష్ వెంగల్‌రావు, ప్రేందాస్, అనిల్, మోహన్, లాల్‌సింగ్, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ అవార్డ్‌కు శాంభవి స్కూల్ విద్యార్థిని ఎంపిక

నవతెలంగాణ - బాల్కొండ



విద్యార్థిని తయారు చేసిన రీఫిల్‌లో సిరా నింపే పరికరం

మండల కేంద్రంలోని శాంభవి ఉన్నత పాఠశాల విద్యార్థిని జెట్టి అభిజ్ఞ 2022-23 ఇన్‌స్పైర్ అవార్డుకు మానక్ రాష్ట్ర స్థాయిలో ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మధుసూదన్ రాజు తెలిపారు. బాల్ పెన్ రీఫిల్‌లో సిరాను నింపే పరికరాన్ని అభిజ్ఞ తయారు చేసినట్లు ఆయన చెప్పారు. ఈ పరికరానికి పదివేల నగదు బహుమానంగా పొందినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ విద్య సంవత్సరం అభిజ్ఞతో పాటు సం యుక్త,తనీష్ జిల్లా స్థాయిలో ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ముగ్గురు ఒక్కొక్కరిగా పదివేల రూపాయలు బహుమతులు గా పొందారని అన్నారు. ఈ ఇన్‌స్పైర్డ్ అవార్డులకు రాష్ట్రస్థాయిలో 116 మంది విద్యా ర్థులు పరీక్షలు రాయగా, జిల్లా వ్యాప్తంగా 12 మంది విద్యార్థులు ఎంపిక కాగా బాల్కొండలోని శాంభవి స్కూల్ నుండి తమ విద్యార్థిని ఎంపిక కావడంతో ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ బొట్ల రవిన్ ప్రసాద్,ఉపాధ్యాయులు కృష్ణ దాస్, సౌమ్య, మనోజ్ఞ వారిని అభినందించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
నిజామాబాద్-కామారెడ్డి
శుక్రవారం | ఫిబ్రవరి 16, 2024 | www.navatelangana.com

పారిశుధ్య కార్మికులకు సన్మానం

నవతెలంగాణ-ఏర్గట్ల

రాష్ట్రప్రభుత్వం ఈ నెల 7నుండి 14వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ఏర్గట్ల, తొర్తి గ్రామాలకు చెందిన పారిశుధ్య కార్మికులను స్పెషల్ ఆఫీసర్లు శివ చరణ్, అబ్దుల్ మాలిక్, కార్యదర్శులు జాకీర్ హుస్సేన్, అనిల్ సన్మానించారు. కార్యక్రమంలో కారోబార్లు సాయన్న, రఫీక్, రాకేష్, అంగన్వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.



కార్మికులను సన్మానిస్తున్న అధికారులు

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శనకు సత్యశోధక్ విద్యార్థులు

నవతెలంగాణ-సిరికొండ

రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శనకు సత్యశోధక్ పాఠశాల చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైయ్యారని ప్రిన్సిపాల్ నర్సయ్య తెలిపారు గత డిసెంబర్ మాసంలో జిల్లా స్థాయి ఆన్లైన్ ప్రదర్శనలో పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని సి. హెచ్. కృతిక తయారు చేసిన 'కార్న్ కాబ్ రోస్టింగ్ మెషిన్' (మొక్కజొన్న కంకులను కాల్చుటకు ఉపయోగపడు యంత్రం), 7వ తరగతి విద్యార్థి జి. అద్వైత్ రెడ్డి తయారు చేసిన 'పీలింగ్ ద గ్రెన్స్ ఆపరేటింగ్ మెషిన్' (ధాన్యాని కుప్పగా, ఆర బెట్టుటకు ఉపయోగపడు యంత్రం) పనితీరు ప్రాజెక్ట్ లను సమర్పించారని తెలిపారు. పాఠశాల గైడ్ టీచర్ సతీష్ పర్యవేక్షణలో అత్యుత్తమ ప్రతిభ నైపుణ్యలతో తయారుచేసి రూపొందించిన రెండు ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపికఅయ్యాయని అన్నారు.





నిజామాబాద్ సిటీ: సేవాలాల్ విగ్రహానికి పూలమాలలు వేసిన నాయకులు



ఏర్గట్లలో...



భీంగల్‌లో...

బంజారా జాతిని చైతన్య పరిచిన వ్యక్తి సేవాలాల్ మహారాజ్

- సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి ఉత్సవాలు

నవతెలంగాణ-విలేకరులు

సిరికొండ : బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహారాజ్ 285 వ జయంతి ఉత్సవాలు మండలంలోని బంజారా భవనంలో గురువారం బంజార నాయకులు ఘనంగా నిర్వమించారు. భోగ్ బండార్ నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వాలీబాల్ టోర్నమెంట్ ను ప్రారంభించారు. కార్యక్రమంలో బంజారా సంఘం మండల అధ్యక్షుడు లష్కర్ నాయక్, ఉపాధ్యక్షుడు గణేష్, చందర్ నాయక్, జడ్పిటిసి మాన్సింగ్ , ఎంపీపీ సంగీత రాజేందర్, బావ్ సింగ్, గజన్ లాల్ , బంజారా శక్తి మూమెంట్ రాష్ట్ర యువజన అధ్యక్షుడు రవి నాయక్, జిల్లా ప్రెసిడెంట్ భూపతి నాయక్ , జిల్లా బిఎస్ఎమ్ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ నాయక్, దేవేందర్ నాయక్, ప్రభులాల్ తదితరులు పాల్గొన్నారు

నిజామాబాద్ సిటీ: గిరిజన విద్యార్థి సంఘం లంబాడా కుల పోరాట సమితి ఆధ్వర్యంలో వినాయక్ నగర్ రుక్మిణి ఛాంబర్ వద్ద సద్గురు సంత సేవాలాల్ జయంతి సందర్భంగా గిరిజన విద్యార్థి సంఘం, లంబాడాకుల పోరాట సమితి నాయకులు మాట్లాడుతూ.. సేవాలాల్ మహారాజ్ గిరిజనులకు దశ దిశను చూపి హైందవ ధర్మం విశిష్టతను, బంజారా జాతి గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి అని అన్నారు. అందుకే ఆయన్ను గిరిజన ఆరాధ్య దైవంగా భావిస్తారని తెలిపారు. బ్రిటిష్ సామ్రాజ్యాన్ని వ్యతిరేకించి గిరిజనుల వృత్తిని సంస్కృతి సంప్రదాయాలను గొప్పతనాన్ని చాటి చెప్పిన వ్యక్తి సంత సేవాలాల్ మహారాజ్ అని అన్నారు. హైదరాబాద్ నడిబొడ్డున సేవాలాల్ మహారాజ్ 108అడుగుల విగ్రహాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలని తెలిపారు. వచ్చే సంవత్సరం నాటికి 33 జిల్లా కేంద్రాలలో సంతు శ్రీ సేవాలాల్ మహారాజ్ భవనాలు ఏర్పాటు చేసి ఆ భవనంలో సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం. లంబాడి హక్కుల పోరాట సమితి నాయకులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరశురాం రాథోడ్ జి వి ఎస్ జిల్లా అధ్యక్షులు నేనావత్ జైత్రం రాథోడ్. ఎల్ హెచ్ పి ఎస్. సుందర్ సింగ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బానోతు రాందాస్, నాయకులు సందీప్, వంశీ ప్రేమ్, శేఖర్, రమేష్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు

ఏర్గట్ల : మండలంలోని బట్టా పూర్ తండాలో సేవాలాల్ జయంతి వేడుకల్లో భాగంగా జగదాంబ, సేవలాల్ ఆలయాల వద్ద భోగ్ బండార్ నిర్వహించి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా తండా అధ్యక్షుడు భీమానాయక్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సేవాలాల్ మహారాజ్ అడుగు జాడల్లో నడవాలని అన్నారు. కార్యక్రమంలో తాండవాసులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండల కేంద్రంతోపాటు,ఇందల్ వాయి మండలంలోని ఆయా గ్రామాలు, తెలంగాణ యూనివర్సిటీ లోని ఓల్డ్ బాయ్స్ హాస్టల్లో శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు ఎస్సీ ఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్. భ్రమరాంబిక అధ్యక్షతన, గిరిజన సంఘాల అధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ యాదగిరి పాల్గొని మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహారాజ్ బంజారా జాతి ఔన్నత్యంతోపాటు విశ్వ మానవ అభివృద్ధికి పాల్పడ్డారన్నారు. సేవాలాల్ మహారాజ్ దేశంలోని బంజారా జాతిని చైతన్య పరిచారన్నారు. నీతి, నిజాయితీగా బతకడం మద్యపానానికి, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని జీవితాంతం పోరాటం చేశారని తెలిపారు. ప్రొఫెసర్ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ సేవాలాల్ ఆదర్శాలను కొనసాగిస్తూ గిరిజన విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగడానికి చదువులపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ రెడ్డి, ఆంజనేయులు, ఆచార్య రాంబాబు, ఖైసర్ మహమ్మద్, డాక్టర్ నీలిమ, డాక్టర్. పున్నయ్య, డాక్టర్ కిరణ్ రాథోడ్, డాక్టర్ ప్రవీణ్, ఎం శ్రీనివాస్ రాథోడ్, బోనోత్ లక్ష్మణ్, కాంటాక్ట్ అధ్యాపకులు, గిరిజన ఔట్సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

భీంగల్: పట్టణ కేంద్రంలోని బంజారా సేవా సంఘం భవనంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం మండల అధ్యక్షుడు శర్మ నాయక్ ఆధ్వర్యంలో సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల బంజారా సంఘం సభ్యులు పాల్గొన్నారు. ఐచ్చిక సెలవు ప్రకటించిన ఘనత ప్రభుత్వానిది తెలంగాణ రాష్ట్రంలో సేవాలాల్ జయంతి సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగులకు ఐచ్చిక సెలవు ప్రకటించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దేనిని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం యువజన విభాగం మండల అధ్యక్షుడు నేనావత్ నరేందర్ అన్నారు. మండలంలోని గోనుగుప్పుల గ్రామంలో పంత్ సేవాలాల్ జయంతి వేడుకలను నరేందర్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు.

గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తా

- గ్రామాల్లో పర్యటించిన కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని చేపూర్, కోమన్ పల్లి, ఫతేపూర్, గ్రామాలలో గ్రామ అభివృద్ధి పనులకోసం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి గురువారం పర్యటించి గ్రామస్తులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. గ్రామ అభివృద్ధి కోసం ప్రభుత్వం నుండి నిధులు మంజూరు చేయిస్తానని హామీనిచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయిస్తానని, ప్రస్తుతం గ్రామంలో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక అధికారులు గ్రామస్తులతో కలిసి చర్చించి ప్రభుత్వానికి నివేదికలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి డాక్టర్ లక్కం ప్రభాకర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిన్నా రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గ్రూపు రాజకీయాలు చేస్తే ఊరుకునేది లేదు

- టీడీపీ పార్లమెంట్ అధ్యక్షులు



మాట్లాడుతున్న టీడీపీ పార్లమెంట్ అధ్యక్షులు యాదాగౌడ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పార్టీలో గ్రూపు రాజకీయాలు చేస్తే ఊరుకునేది లేదని పార్లమెంట్ అధ్యక్షులు దేగాం యదాగౌడ్ అన్నారు. గురువారం నిజామాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పార్లమెంట్ జనరల్ సెక్రెటరీ సిహెచ్ హనుమంత రావు హాజరయ్యారు. తెలుగుదేశం పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అర్బన్ కమిటీలు పునర్నిర్మాణం చేయాలని పార్లమెంట్ కమిటీ నాయకులు నిర్ణయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలో గ్రూపు రాజకీయాలు చేస్తే ఊరుకునేది లేదని, ఎవరైనా దానికి ప్రోత్సహిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని అన్నారు. కార్యక్రమంలో అర్బన్ ఇంచార్జ్ వినోద్ కుమార్, జెనరల్ సెక్రెటరీ రెంజర్ల సురేష్, పార్లమెంట్ కమిటీ నాయకులు జ్యోతి నారాయణ, అనుబంధ సంఘ అధ్యక్షులు దంతాల ఆనంద్,అహ్మద్, అర్బన్ సీనియర్ నాయకులు అంబిక సత్యనారాయణ, కొయేడి నర్సింలు, కల్లేడి గంగాధర్, శంకర్ ముదిరాజ్, లవంగ రాజు, అశోక్ అర్సపల్లీ, రమేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వృద్ధుని మృతదేహం లభ్యం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని అపోలో మెడికల్ దగ్గర గుర్తుతెలియని వ్యక్తి అనారోగ్య కారణాలతో చనిపోయినట్టు ఎస్సై గంగాధర్ గురువారం తెలిపారు . ఈయన వయస్సు 70 నుండి 75 సంవత్సరాల మధ్య ఉంటుందని అన్నారు. మృతదేహాన్ని పట్టాణ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చరీ గదికి తరలించామని తెలిపారు. మృతుడి ఆచూకీ కోసం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని తెలిపారు.

కార్మికులతోనే గ్రామ పరిశుభ్రత

- పంచాయతీ కార్మికులకు సన్మానం
- ఎంపిఓ శ్రీనివాస్ గౌడ్



సన్మానిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గ్రామ పంచాయతీ కార్మికులతోనే గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయని, వారందరినీ సన్మానించడం అభినందనీయమని ఎంపిఓ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని నడిపల్లి మేజర్ గ్రామ పంచాయతీలో 7నుంచి 14 వరకు నిర్వహించిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారని అన్నారు. నడిపల్లి పంచాయతీలో గ్రామసభ నిర్వహించి పంచాయతీ కార్మికులు జనార్దన్, శ్యాంసన్, నర్సయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మేజర్ గ్రామ పంచాయతీ గ్రేడ్ వన్ కార్యదర్శి నిట్టు కిషన్ రావు, సిబ్బంది సంతోష్, రాము తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల లోడ్ టెస్ట్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

జిల్లా కేంద్రంలోని వినాయకనగర్‌లోగల ఈవీఎం గోడౌన్‌లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ఫస్ట్ లెవెల్ చెకింగ్ (ఎఫ్ఎల్‌సి) ప్రక్రియలో భాగంగా గురువారం లోడ్ టెస్ట్ నిర్వహించారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఈవీఎం గోడౌన్‌ను సందర్శించి లోడ్ టెస్ట్ ప్రక్రియను పరిశీలించారు. ఎన్నికల్లో గరిష్ట సంఖ్యలో అత్యధిక మంది అభ్యర్థులు పోటీలో ఉన్న పక్షంలో అభ్యర్థుల సంఖ్యను అనుసరిస్తూ బ్యాలెట్ యూనిట్లను వినియోగించాల్సి ఉంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని ఎఫ్ఎల్‌సీ సందర్భంగా గురువారం ఒక్కో కంట్రోల్ యూనిట్ కు నాలుగేసి చొప్పున బ్యాలెట్ యూనిట్లను అనిసంధానిస్తూ వాటి పనితీరును పరిశీలించారు. జిల్లా ఎన్నికల అధికారి సమక్షంలో ఈసీఐఎల్ ఇంజినీర్లు ఈ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించారు. కలెక్టర్ వెంట జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిణి కృష్ణవేణి, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్, సంతోష్, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

విలీన మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆర్మూర్

దేశ చరిత్రలో మొదటిసారిగా కమ్యూనిస్టు పార్టీలు విలీనం కావడం జరుగుతుందని, ఈ విలీన మహాసభలను ప్రజలందరూ జయప్రదం చేయాలని కోరారు. గురువారం పట్టణంలోని కుమార్ నారాయణ భవన్ లో సిపిఎంఎల్ ప్రజా పంత పార్టీ ఆధ్వర్యంలో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డివిజన్ కార్యదర్శి బి,దేవారం, సబ్ డివిజన్ కార్యదర్శి బి,కిషన్ మాట్లాడుతూ.. ప్రజల కోసం, ప్రజా హక్కుల కోసం ఒక్కటిగా పోరాడాలని సిపిఐ ఎంఎల్ ప్రజా పంథా, పిసిసి సిపిఐ (ఎంఎల్) సిపిఐఎంఎల్ పార్టీలు ఏకమవుతున్నాయని తెలిపారు. ఈ విలీన మహాసభలను ఖమ్మంలో వచ్చే నెలలో 3,4,5 తేదీల్లో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ కమిటీ నాయకులు ముత్తెన్న, రాజన్న ఆకుల గంగన్న, శేఖర్, తలారి గంగాధర్, లక్ష్మి, అనిల్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

- ఎంపీపీ పస్కా నరసయ్య

నవతెలంగాణ-ఆర్మూర్

విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఎంపిపి పస్కా నరసయ్య అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని మచ్చర్ల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కంప్యూటర్ ల్యాబ్ అవసరం నిమిత్తం కుర్చీలు రోటరీ సభ్యుడు రాజు వితరణ చేశారు. పదవ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల అవసర నిమిత్తం పరీక్ష ప్యాడ్స్ తులసి కుమార్ వితరణ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపిపి హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. లక్ష్యాన్ని ఏర్పరచుకొని లక్ష్యం కోసం పట్టుదలతో శ్రమించి గ్రామానికి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. అధ్యక్షులు పట్వారి గోపి కృష్ణ మాట్లాడుతూ.. 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో 10/10 సాధించిన విద్యార్థులకు ఇంటర్మీడియట్ పుస్తకాలను ఉచితంగా అందజేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్పాన్సర్ ప్రోజెక్ట్ ఛైర్మన్ రాజు,ప్రధానోపాధ్యాయులు పండరి, కృష్ణా రెడ్డి,మాజీ సర్పంచ్ గంగారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్యాడ్స్ పంపిణీ చేస్తున్న రాజు, తదితరులు

ఉమ్మడి జిల్లాల హ్యాండ్‌బాల్ ఎంపికలు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని పెర్కిట్ విశాఖ నగర్ నవ్య భారతి గ్లోబల్ స్కూల్ నందు ఉమ్మడి జిల్లాల సీనియర్ మెన్ అండ్ ఉమెన్ హ్యాండ్ బాల్స్ సెలక్షన్స్ గురువారం జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు గంగ మోహన్ చక్రు, ప్రధాన కార్యదర్శి పింజ సురేందర్ ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఎంపికలో నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా సీనియర్ మెన్, ఉమెన్ హ్యాండ్ బాల్ జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 17,18, 19 తేదీల్లో కరీంనగర్‌లో జరగబోయే 52 వ తెలంగాణ రాష్ట్రస్థాయి సీనియర్ మెన్ అండ్ ఉమెన్ హ్యాండ్ బాల్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా హ్యాండ్ బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి పింజ సురేందర్, కోశాధికారి గట్టడి రాజేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా జిల్లా హాకీ సంఘం అధ్యక్షులు విశాఖ గంగారెడ్డి, నవ్య భారతి గ్లోబల్ స్కూల్ డైరెక్టర్ జవహర్, హాకీ సంఘం ప్రధాన కార్యదర్శి సదమస్తుల రమణ, వ్యాయామ ఉపాధ్యాయులు మాధురి, కొండ్రా అంజు, సంజీవ్, అనూష తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు మిసిమి విద్యార్థినులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని మిసిమి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినిలు రియ, గగన శ్రీ, నమిత రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ బాలి రవీందర్ తెలిపారు. ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఆర్మూర్ నవ్య భారతి గ్లోబల్ హై స్కూల్లో సీనియర్ బాలికల విభాగంలో హ్యాండ్ బాల్ ప్రాబబుల్ జట్ల ఎంపిక నిర్వహించారు. ఈ పోటీల్లో మిసిమి పాఠశాల విద్యార్థులు రియ, గగన శ్రీ, నమిత ఉత్తమ ప్రతిభ కనబరిచి నిజామాబాద్ జిల్లా జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. కరీంనగర్ జిల్లాలో ఈ నెల 17,18,19 తేదీల్లో జరగబోయే 53వ రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులను, వ్యాయామ ఉపాధ్యాయుడిని కరస్పాండెంట్ బాలి రవీందర్, ప్రధానోపాధ్యాయులు కృష్ణ చైతన్య, ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు.



18న గిరిజన గురుకులాల సీఓఈ ప్రవేశ పరీక్ష

- రీజినల్ కో ఆర్డినేటర్ టి.సంపత్ కుమార్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఈ నెల 18 న గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ పరిధిలోని ప్రతిభా జూనియర్ కళాశాలలో ప్రవేశం నిమిత్తం ఈనెల ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహించనున్నట్లు గిరిజన సంక్షేమ గురుకులాల విద్యాలయాల సంస్థ టి.సంపత్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ జిల్లాలోని ఇందల్ వాయి మండల కేంద్రంలోని తిర్మన్ పల్లి గిరిజన గురుకుల పాఠశాలలో 258 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు వివరించారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని ఆయన వివరించారు.

కమ్యూనిటీ కాంట్రాక్ట్‌పై అవగాహన

నవతెలంగాణ-ముప్కాల్

మండలం వేంపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు కమ్యూనిటీ కాంటాక్ట్‌పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్ఐ భాస్కరా చారి విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలు, సైబర్ నేరాలు, పిల్లల అపహరణ, వ్యక్తిత్వ వికాసాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఎస్ఐ భాస్కరా చారిని పాఠశాల బృందం చిరు జ్ఞాపికతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ నారాయణ, పోలీసు శాఖ సిబ్బంది నవనిత్, రమాదేవి, గంగామణి తదితరులు పాల్గొన్నారు.

సిద్దులగుట్ట శివరాత్రి ఉత్సవ కమిటీ ఏర్పాటు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ కేంద్రంలోని నవనాథ సిద్ధుల గుట్టపై శివరాత్రి వేడుకలను నిర్వహించడానికి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పొద్దుటూరి వినయ్ రెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవాల నిర్వహణ కమిటీని గురువారం ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో భారత్ గ్యాస్ సుమన్, పీసీ గంగారెడ్డి, కోడిగెల మల్లయ్య, గంగాదేవి రైస్ మిల్ సూరజ్, కొంతం మంజుల మురళి, ప్రశాంత్ గౌడ్, జిమ్మి సంధ్యరవి, హజారి సతీష్, శ్రీనివాస్ చెందేషి, అలిశెట్టి నరేష్, పొద్దుటూరి చరణ్ రెడ్డి, బట్టు శంకర్‌లను కమిటీ సభ్యులుగా నియమించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సాయిబాబా గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మీసాల రవి, చిట్టి రెడ్డి, చిలుక రాజు, భూపేందర్, శ్యామ్, ప్రసాద్, యోగి, భూమేష్, నటరాజ్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించిన నాయకుడు

- షబ్బీర్ అలీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖల ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ జన్మదినం సందర్భంగా తెలంగాణ యూనివర్సిటీ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు పంచరెడ్డి చరణ్ ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ యూనివర్సిటీలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పంచరెడ్డి చరణ్ మాట్లాడుతూ.. షబ్బీర్ అలీ 40 ఏళ్ళుగా కాంగ్రెస్ పార్టీలో ఉంటూ ప్రజాభివృద్దే ధ్యేయంగా పనిచేశారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్మూర్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బైండ్ల ప్రశాంత్ నరస్ దీప్, రమేష్,అఖిల్, శివ నరేష్ తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న పూర్వ విద్యార్థులు